
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 26 మార్చి 2025







స్థూల ఉత్పాదకతలో సంవృద్ధి

తలసరి ఆదాయంలో కీలక స్థానాలు

తలసరి ఆదాయంలో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. కృష్ణాజిల్లా తలసరి ఆదాయం రూ.4,18,997 కాగా, ఎన్టీఆర్ జిల్లా తలసరి ఆదాయం రూ.3,53,150గా నమోదైంది. కిందటి ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కృష్ణాజిల్లాలో రూ.69,313, ఎన్టీఆర్ జిల్లాలో రూ.64,262 మేర తలసరి ఆదాయం పెరిగింది. కృష్ణాజిల్లాలో 16.54 శాతం, ఎన్టీఆర్ జిల్లాలో 18.20 శాతం వృద్ధి నమోదైంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26లో కృష్ణాజిల్లా రూ.4,88,310, ఎన్టీఆర్ జిల్లా రూ.4,17,412 తలసరి ఆదాయాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నాయి.

ఎన్టీఆర్ జిల్లా 2, కృష్ణాజిల్లా 3 స్థానాలు

- రూ.94,562 కోట్ల ఉత్పత్తి సాధించిన ఎన్టీఆర్ జిల్లా
- రూ.87,742 కోట్ల ఉత్పత్తితో కృష్ణాజిల్లా
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో గణాంకాలు విడుదల చేసిన సీఎం
- రాష్ట్ర జీడీడీపీలో ఎన్టీఆర్ 5.79, కృష్ణా 5.57 శాతం కాంట్రిబ్యూషన్
- తలసరి ఆదాయంలో రెండు, మూడు స్థానాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జీడీడీపీ)లో రాష్ట్రంలోనే ఎన్టీఆర్ జిల్లా రెండు, కృష్ణాజిల్లా మూడు స్థానాలు పొందాయి. విశాఖపట్నం మొదటి స్థానం సాధించింది. కొద్దిరోజుల్లో ముగియనున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ రంగాల్లో ఎన్టీఆర్ జిల్లా రూ.94,562 కోట్లు, కృష్ణాజిల్లా రూ.87,742 కోట్ల ఉత్పాదకతను పొందాయి. గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోల్చుకుంటే ఎన్టీఆర్ జిల్లా 10.09 శాతం, కృష్ణాజిల్లా 11.58 శాతం మేర జీడీడీపీలో వృద్ధిని నమోదు చేశాయి. వ్యవసాయానుబంధ రంగాల కేటగిరీలో వ్యవసాయం, ఉద్యానం, మాంసం, చేపలు, రొయ్యల ఉత్పత్తిలోనూ, పారిశ్రామిక రంగాల కేటగిరీలో మైనింగ్, క్వారీయింగ్, తయారీ, విద్యుత్, గ్యాస్, వాటర్ సప్లై, నిర్మాణం వంటి రంగాల్లో ఉత్పాదకత, సేవా రంగంలో వ్యాపారం, హోటళ్ళు, రెస్టారెంట్లు, రైల్వే, బ్యాంకింగ్, రవాణా, రియల్ ఎస్టేట్ తదితర రంగాలకు సంబంధించి సాధించిన జీడీడీపీని మంగళవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు విడుదల చేశారు.



సీఎం కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

ఎన్టీఆర్ జిల్లాలో వృద్ధి

వ్యవసాయ రంగంలో ఎన్టీఆర్ జిల్లా రూ.1,081 కోట్లు సాధించి 1.24 శాతం కంట్రిబ్యూషన్ అందించింది. ఉద్యాన రంగంలో మాత్రం రూ.4,905 కోట్ల ఉత్పాదకతను సాధించి, 5.62 శాతం వృద్ధితో కంట్రిబ్యూషన్ అందించింది. లైవ్‌స్టాక్ (మాంసం) రంగంలో రూ.4,414 కోట్ల ఉత్పాదకతతో, 5.06 శాతం వృద్ధితో కంట్రిబ్యూషన్ అందించింది. మొత్తంగా వ్యవసాయ రంగంలో 2022-23తో పోల్చుకుంటే, 2024-25కు 15.94 శాతం వృద్ధితో రూ.1,737 కోట్ల

మిగతా 8లో..

వీఎంసీ కౌన్సిల్‌లో చర్చ

ఆధునికీకరణ జరగాలంటే కార్పొరేషన్ అధికారులు స్టేడియాన్ని శాప్‌కు అప్పగించాలి. శాప్ రాసిన లేఖపై కొద్దిరోజుల క్రితం వరకు వీఎంసీ అధికారులు తర్జనభర్జన పడ్డారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో స్టేడియాన్ని శాప్‌కు అప్పగించేద్దామన్న అభిప్రాయాన్ని పలువురు కార్పొరేటర్లు వ్యక్తం చేశారు. అయితే, దీనిపై ఎలాంటి తీర్మానం చేయలేదు.



ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న పనులు

ఇక ఆధునిక ఐజీఎంఎస్

ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధికి అడుగులు

- తమకు అప్పగించాలని వీఎంసీకి శాప్ లేఖ
- జాతీయ క్రీడల నిర్వహణకు అనువుగా ఆధునికీకరణ
- రూ.10 కోట్లతో సింథటిక్ ట్రాక్‌ల అభివృద్ధికి ప్రణాళిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌తో పాటు ఎన్నో రంజీ మ్యాచ్‌లు నిర్వహించిన నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం కొత్తరూపు సంతరించుకోనుంది. ఇప్పటివరకు భారీ సభల నిర్వహణకు, స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలకు కేంద్రంగా ఉన్న ఈ స్టేడియాన్ని ఇకపై జాతీయ క్రీడలు నిర్వహించేందుకు వీలుగా అభివృద్ధి చేయాలని క్రీడాప్రాధికార సంస్థ (శాప్) అధికారులు భావిస్తున్నారు. అభివృద్ధి నిమిత్తం స్టేడియాన్ని తమకు అప్పగించాలని శాప్ అధికారులు విజయవాడ నగరపాలక సంస్థ అధికారులకు కొద్దిరోజుల క్రితం లేఖ కూడా రాశారు.

రూ.10 కోట్లతో సింథటిక్ ట్రాక్‌లు

స్టేడియం ప్రస్తుతం నగరపాలక సంస్థ ఆధీనంలో ఉంది. గ్యాలరీలకు దిగువన ఉన్న గదులను వివిధ క్రీడా సంఘాలు ఉపయోగించుకుంటున్నాయి. స్టేడియం లోపల ఆడుకోవడానికి ప్రాంగణం, రన్నింగ్ ట్రాక్

మిగతా 8లో..

అవినీతికి సహకారం

మచిలీపట్నం మండలం గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో కోటి రూపాయలకు పైగా గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. రైతులు రుణాలను చెల్లించినప్పటికీ.. ఇంకా బకాయిలుగా రికార్డుల్లో చూపడం వివాదాస్పదమవుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన పీఏసీఎస్ అధ్యక్షుడు, మాజీమంత్రి పేర్ని నాని ముఖ్య అనుచరుడితో పాటు పీఏసీఎస్ సెక్రటరీ (సీఈవో) ఈ అక్రమాలకు కారణమని రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.



గోకవరం పీఏసీఎస్‌లో రూ. కోటి గోల్‌మాల్

రైతులు చెల్లించిన రుణాలు హాంఫట్

పేర్ని నాని ముఖ్య అనుచరుడు, ఓ సీఈవో అక్రమాలు

- రైతుల ఆగ్రహం.. 51 విచారణ జరపాలని డిమాండ్
- విషయం బయటపెట్టిన సూపర్‌వైజర్‌పై దాడికి యత్నం
- చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు
- విచారణ జరపకుండా పోలీసుల జాప్యం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మూడెకరాల భూమి రైతు పేరున ఉంటే చాలు.. కేడీసీసీ బ్యాంకుకు అనుబంధంగా ఉన్న పీఏసీఎస్‌లలో లాంగ్‌టర్మ్‌గా రూ.25 లక్షల వరకు రుణం ఇస్తారు. మచిలీపట్నం మండలం గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో అధికశాతం మంది రైతులు రొయ్యలు, పండుగప్ప చేపల సాగు, వ్యవసాయం చేస్తుండటంతో ఇలాగే లాంగ్‌టర్మ్ రుణాలు తీసుకున్నారు. రుణం కోసం దరఖాస్తు చేసుకుంటే, సంబంధిత పొలం పత్రాల పరిశీలన, రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్టిగేజ్ చేసే పనులను పీఏసీఎస్ సీఈవో భాస్కర్ చూసుకునేవాడు. అతనిపై ఉన్న నమ్మకంతో రైతులు రుణాలు తీసుకుని, సకాలంలో చెల్లించేవారు. కాగా, గోకవరం పీఏసీఎస్ అధ్యక్షుడు వైసీపీకి చెందిన వ్యక్తి. ఇతను మాజీమంత్రి పేర్ని నానికి ముఖ్య అనుచరుడు. కేడీసీసీబీ పాలకవర్గంలోనూ దీర్ఘకాలం డైరెక్టర్‌గా కొనసాగాడు. కేడీసీసీబీ ప్రధాన కార్యాలయంలోని అధికారులతో తనకున్న పరిచయాలను ఆసరాగా చేసుకుని సీఈవోతో కలిసి కోటి

మిగతా 8లో..

పీఏసీఎస్ సూపర్‌వైజర్‌పై దాడి

గోకవరం పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలు వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారం మొత్తాన్ని ఇక్కడ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జడా ప్రభాకరరావు బయటపెట్టాడనే కారణంతో అతనిపై రెండు రోజులక్రితం గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు దాడిచేశారు. ఈ నెల 23న విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న సమయంలో చిలకలపూడి గోడౌన్స్ సమీపంలో కాపుకాసిన ఇద్దరు వ్యక్తులు అతని కళ్లలో రసాయనాలు చల్లారు. అనంతరం దాడి చేయబోగా, అతను తప్పించుకున్నాడు. ఈ ఘటనపై బాధితుడు చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలపూడి పోలీస్‌స్టేషన్ సీఐ నబీ తెలిపారు. గోకవరం పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిన వెంటనే విచారణ చేస్తామని కేడీసీసీబీ సీఈవో శ్యామ్ మనోహర్ తెలిపారు.



చిరు తాబేళ్ల సందడి

నాగాయలంక సముద్ర తీరంలో ఆలివ్ రిడ్లే చిరు తాబేళ్లు సందడి చేస్తున్నాయి. ఆడ తాబేళ్లు గుడ్ల దశ నుంచి చిరు తాబేళ్లుగా బయటకు రావటం గగనమైపోతున్న దశలో వాటిని పరిరక్షించేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టారు. ఐదు నెలలు గుడ్లను కాపాడిన అధికారులు అవి తాబేళ్లుగా మారాక తీరంలో వదిలారు. ఇలా వదిలిన వందలాది చిరు తాబేళ్లు ఇప్పుడు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి.

8లో

జగ్గయ్యపేట కోల్డ్ స్టోరేజీలో భారీ అగ్ని ప్రమాదం



మిర్చి మంటలు

ముందు నుంచి వెళ్దామంటే ఓ సమస్య. వెనుక నుంచి వెళ్లాలంటే మరో సమస్య. ఒక్కో ప్రదేశంలో మంటలను ఆర్పుతూ ముందుకు సాగుదామంటే మిర్చి మంటలు, ఆపై ఘాటు. ఇదీ జగ్గయ్యపేట మండలం తొర్రగుంటపాలెంలో సాయితిరుమలగిరి అగ్రి ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోల్డ్ స్టోరేజీలో అగ్నిమాపక సిబ్బందికి ఎదురవుతున్న పరిస్థితి. మిర్చి ఘాటుకు మంటలను ఆర్పడం కష్టతరమవుతుండగా, మరో రెండు రోజుల వరకు మంటలు అదుపులోకి వచ్చే పరిస్థితి లేకుండాపోయింది.



కోల్డ్ స్టోరేజీ నుంచి భారీగా వస్తున్న పొగ (ఇన్‌సెట్‌లో) మంగళవారం అర్ధరాత్రి కూడా భారీగా ఎగసి పడుతున్న మంటలు

బూడిదైన రూ.15 కోట్ల విలువైన మిర్చి పంట

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానేనని ప్రాథమిక అంచనా
- మంటలను అదుపు చేయలేకపోతున్న అగ్నిమాపక సిబ్బంది
- ఆపరేషన్‌కు అడ్డుగా మారుతున్న మంటలు.. ఆపై ఘాటు
- అదుపునకు మరో రెండు రోజులు పట్టే అవకాశం
- రికార్డులను సీజ్ చేసిన మార్కెటింగ్ అధికారులు
- ఇటీవలే రూ.6 కోట్ల రుణం తీసుకున్నట్టు నిర్ధారణ
- ఫైర్ ఎన్‌వోసీ లేదు.. అగ్నినిరోధక యంత్రాలు కూడా లేవ్..!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జగ్గయ్యపేట మండలం తొర్రగుంటపాలెంలో సాయితిరుమలగిరి అగ్రి ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోల్డ్ స్టోరేజీలో సోమవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానేనని అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. సుమారు ఎకరం స్థలంలో ఇక్కడ కోల్డ్ స్టోరేజీ ఉంది. సుమారు రూ.15 కోట్ల వరకు నష్టం జరిగి ఉంటుందని చెబుతున్నారు. ఇందులో మిర్చిని భద్రపరచడానికి ప్రత్యేకంగా భారీ పరిమాణంలో అరలు

మిగతా 8లో..

మంటల ఘాటుకు అల్లకల్లోలం

జగ్గయ్యపేట చుట్టుపక్కల ఉన్న అగ్నిమాపక వాహనాలను రంగంలోకి దించి మంటలను అదుపు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. అగ్నిమాపక సిబ్బంది ఒక్కో అడుగు ముందుకు వేయడానికి ఎక్కువ సమయం పడుతోంది. స్టోరేజీ మొత్తం అరలు అరలుగా ఉండటం, అందులో ఉన్న మిర్చి మండుతూ ఉండటంతో ఘాటు ఎక్కువగా బయటకు వస్తోంది. మిర్చి మండటంతో అగ్నిమాపక సిబ్బంది ఒళ్లంతా మంటలు పుడుతున్నాయి. మరోపక్క ఘాటు తీవ్రత ఎక్కువగా ఉండటంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. అయినప్పటికీ మంగళవారం సాయంత్రానికి మంటలను కొంతవరకు అదుపు చేయగలిగారు. ఫైర్ టెండర్ల ద్వారా నీటిని బలంగా వెదజల్లినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో కీసర వద్ద ఉన్న సెంటినీ బయో స్పిరిట్స్ నుంచి లిక్విడ్ కార్బన్ డై ఆక్సైడ్ (సీవో2) ట్యాంకర్‌ను రప్పించారు. ఈ ట్యాంకర్‌లో ఉన్న వాయువు మొత్తం అయిపోయినా మంటలు మాత్రం అదుపులోకి రాలేదు. కోల్డ్ స్టోరేజీలో మంటలు అదుపులోకి రావడానికి మరో రెండు రోజుల సమయం పడుతుందని అగ్నిమాపక శాఖ సిబ్బంది చెబుతున్నారు. లోపల ఉన్న అగ్గిని ఆర్పడానికి బుధ, గురువారాల్లో ఆపరేషన్ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

అర్ధరాత్రి ఆగని మట్టి దందా



బుడమేరులో రాత్రి 10 దాటాక టిప్పర్ల హల్‌చల్

- గ్రామాల్లో అతివేగంగా రాకపోకలు
- పట్టించుకోని డ్రెయినేజీ అధికారులు
- నిద్రలేక ఇబ్బంది పడుతున్నామని చేదుర్తిపాడు, మోపర్రు గ్రామస్తుల ఆవేదన

ఆంధ్రజ్యోతి-గుడివాడ : నందివాడ మండలం చేదుర్తిపాడు వద్ద బుడమేరులో మట్టి దోపిడీ కొనసాగుతోంది. రోజూ అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు టిప్పర్లు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ టిప్పర్ల వేగానికి గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా డ్రెయినేజీ అధికారులు పట్టించుకోవట్లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా బుడమేటిలో రాత్రి 10 నుంచి తెల్లవారుజాము 6 గంటల వరకు దాదాపు 40 టిప్పర్ల మట్టిని తరలిస్తున్నారు. దాదాపు ఒక్కో లారీ 35 నుంచి 40 ట్రిప్పులు తిరుగుతున్నట్లు సమాచారం.

మట్టి తరలింపు ఇలా..

బుడమేరు కట్ట నుంచి బయల్దేరుతున్న మట్టి టిప్పర్లు ఉంగుటూరు మండలం నందమూరు అడ్డరోడ్డు మీదుగా రాజుపేట, ఉయ్యూరు మీదుగా గండిగుంటకు చేరుతున్నాయి. అక్కడ ప్రైవేట్ రియల్ వెంచర్లకు, ఉంగుటూరులోని రియల్ ఎస్టేట్‌కు మట్టి తరలిస్తున్నట్లు కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు.

గ్రామస్తుల గగ్గోలు

అర్ధరాత్రి 120 కిలోమీటర్ల స్పీడుతో దూసుకెళ్తున్న టిప్పర్ల వేగానికి గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు టిప్పర్ల వేగానికి బ్రేక్‌లు వేయాలని, అర్ధరాత్రి తమకు నిద్ర కరువైందని గగ్గోలు పెడుతున్నారు. ముఖ్యంగా

మిగతా 8లో..

పోలీసుల అదుపులో గ్యాంగ్‌వార్ పండు..!

- 22 కిలోల గంజాయితో చిక్కిన రౌడీషీటర్
- రాజమండ్రి నుంచి విజయవాడ తరలిస్తుండగా దాడి
- మరో ముగ్గురు అనుచరుల పట్టివేత.. రిమాండ్

6లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-23 (బుధవారం సాయంత్రం) | సహర్ : 04-47 (గురువారం ఉదయం)



8 నుంచి దుర్గగుడిలో చైత్రమాస కల్యాణ బ్రహ్మోత్సవాలు

6లో

పోలీసులకు చిక్కిన రంగా

- వల్లభనేని వంశీకి కుడిభుజం
- అరెస్టు చేసిన సీఐడీ

8లో

8 నుంచి దుర్గగుడిలో చైత్ర మాస కల్యాణ బ్రహ్మోత్సవాలు



ఇంద్రకీలాద్రి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై ఏప్రిల్ 8 నుంచి 13వ తేదీ వరకు ఆగమోక్తంగా దుర్గామల్లేశ్వర స్వామి వార్ల చైత్రమాస కళ్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 11 రాత్రి 7.30 గంటలకు సుప్రసిద్ధ కవి పండితుల చేత రాయబార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో గంగా, పార్వతీ, మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను రోజుకో వాహనంపై ఊరేగిస్తారు. 8వ తేదీ ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులకు మంగళ స్నానాలు చేయించి వధూవరులుగా అలంకరించి సిద్ధం చేస్తారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, అఖండ దీప స్థాపన, కలశారాధన, బలిహరణ, అగ్నిప్రతిష్టాపన, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 13వ తేదీ ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకుట్నోత్సవము, వసంతోత్సవం, అవబృథ స్నానం, మూకబలి, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు సమాప్తి అవుతాయి. అదేరోజు సాయంత్రం గంగా, పార్వతీమల్లేశ్వరుల ఉత్సవమూర్తుల నదీ విహార కార్యక్రమం జరుగుతుంది. 14 సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, అనంతరం ద్వాదశ ప్రదక్షణలు, పవళింపు సేవ కార్యక్రమాలు, 15వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఏకాంత పవళింపు సేవలు ఉంటాయి.

● 8వ తేదీ వెండి పల్లకి సేవ కనకదుర్గానగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కోమల విలాస్ సెంటర్, సామారంగం చౌక్, బ్రాహ్మణ వీధి, రథం సెంటర్ ద్వారా సాగుతుంది. 9వ తేదీ వెండి రథోత్సవం, 10వ తేదీ రావణ వాహన సేవ, 11వ తేదీ నంది వాహన సేవ, 12వ తేదీ సింహ వాహన సేవ, 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఉత్సవ మూర్తుల నదీ విహారం కొనసాగుతుంది. స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.1,116లు రుసుము చెల్లించి పాల్గొనవచ్చు. శేష వస్త్రం, రవికె, అమ్మవారి శ్రీచక్రపీఠం, పెద్ద లడ్డు, ప్రసాదంతో పాటు ఇరువురికి కళ్యాణానికి ముందుగానే ముఖమండపం నుంచి అమ్మవారి దర్శనం కల్పిస్తారు. కళ్యాణోత్సవం రాత్రి 12.30 గంటలకు ప్రారంభమవుతుంది.

భూసార పరీక్షతో ఏపీలో 1.42 కోట్ల మంది రైతులకు లబ్ధి

» కేంద్ర సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్

వన్‌టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నేల ఆరోగ్యం, విత్తనోత్పత్తి పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మట్టి నమూనాలను పరీక్షించి, రైతులకు భూసార పరీక్ష కార్డులు (సాయిల్ హెల్త్ కార్డులు, ఎస్‌హెచ్‌సి) పంపిణీ చేస్తుంది. ఇప్పటి వరకు ఏపీలో భూసార నిర్ధారణ నిమిత్తం 38,58,795 మట్టి నమూనాలను పరీక్షించగా 1,42,57,644 మంది రైతులకు లబ్ధి చేకూరిందని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామనాథ్ ఠాకూర్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాల వారీగా వచ్చిన ప్రతిపాదనల ప్రస్తుత పరిస్థితిపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంటు సమావేశాల సందర్భంగా లోక్‌సభలో మంగళవారం అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 5 రాష్ట్రాలకు కొత్తగా 25 మొబైల్ భూసార పరీక్షా ప్రయోగశాలలు మంజూరయ్యాయని, బీహార్‌కు 10, మధ్యప్రదేశ్‌కు 9, మహారాష్ట్రకు 2, తెలంగాణకు 2, త్రిపురకు 2 మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్ సందర్శన



పార్లమెంట్‌లో ఏపీ గిరిజన సహకార సంఘం ఏర్పాటు చేసిన అరకు కాఫీ స్టాల్స్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సందర్శించారు. స్టాల్స్ సిబ్బందితో అరకు కాఫీకి దక్కుతున్న ఆదరణ గురించి అడిగి తెలుసుకున్నారు. పార్లమెంట్ లాంటి ప్రతిష్టాత్మక ప్రదేశంలో అరకు కాఫీ అందుబాటులోకి రావడం గిరిజన సమాజానికి లభించిన గొప్ప గౌరవమన్నారు.



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శ్రీదేవి

ఏప్రిల్ నుంచి ఎస్సీలకు సంక్షేమ ఫలాలు!

» పేదలకు భూములు, కార్లు, షాపుల కేటాయింపు
» వైసీపీ పాలనలో ఎస్సీలకు మొండిచేయి
» మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

మచిలీపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో ఎస్సీల సంక్షేమాన్ని గాలికొదిలేశారని, కూటమి ప్రభుత్వం ఎస్సీలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రణాళికను రూపొందించిందని మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఎస్సీల సంక్షేమం కోసం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.341కోట్లను కేటాయించిందన్నారు. ఎస్సీలకు రూ.10లక్షల వ్యయంతో స్విఫ్ట్ డిజైర్‌కార్లు, లైసెన్స్ లేనివారికి శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. పేదలకు భూమి ఇచ్చే ఆలోచనను ప్రభుత్వం చేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా నాలుగువేల ఆటోలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో కేంద్రం వాటా రూ.లక్ష, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 50వేలు సబ్సీడీగా ఇస్తామన్నారు. లబ్ధిదారుని వాటా రూ.15వేలు చెల్లించాలని, మిగతా మొత్తం బ్యాంకులనుంచి రుణంగా ఇప్పించడం జరుగుతుందన్నారు. ఉన్నతి పథకం ద్వారా ఉమ్మడి జిల్లాకు రూ.2.10కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందులో కృష్ణాజిల్లాకు 70 యూనిట్‌లు, ఎన్టీఆర్ జిల్లాకు 82 యూనిట్‌లను కేటాయించినట్టు తెలిపారు. ఏప్రిల్ మొదటివారం నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణకు ఆద్యుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని, సామాజికంగా వెనుబడిన ఎస్సీలకు ప్రస్తుత రిజర్వేషన్‌లద్వారా మేలు చేకూరుతుందని ఉండవల్లి శ్రీదేవి అన్నారు. తొలుత ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం వద్ద అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, ఈడీ షాహిద్‌బాబు, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మరొకరి అరెస్టు

ఇబ్రహీంపట్నం : చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా ఉండవల్లిలోని ఆయన నివాసంపై దాడి చేసిన కేసులో ఇబ్రహీంపట్నంకు చెందిన మడుపల్లి ఆనంద్‌ను సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కేసులో మరికొంతమంది ఇబ్రహీంపట్నంకు చెందిన వ్యక్తులు ఉండగా వారు రేపు స్వయంగా వచ్చి లొంగిపోతామని చెప్పినట్టు తెలిసింది. ఆనంద్ గత వైసీపీ ప్రభుత్వంలో జోగి ప్రధాన అనుచరుడిగా కొనసాగుతూ చంద్రబాబు ఇంటి మీదకు దాడికి వెళ్లాడు. 2024 ఎన్నికల్లో వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆనంద్ టీడీపీలో చేరారు. ప్రస్తుతం అతను టీడీపీలో కొనసాగుతున్నాడు. అయితే ఈ కేసులో అరెస్టు అయిన కొందరు బెయిల్‌పై ఉన్నారు. ఆనంద్ అరెస్టుతో కేసులో ఉన్నవారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

మార్కెట్ కళకళ.. మార్క్‌ఫెడ్ వెలవెల!



» కొనుగోలు కేంద్రాల ముఖం చూడని శనగ రైతులు
» నిబంధనలే ప్రతిబంధకాలు!
» గిట్టుబాటు ధరలో వ్యత్యాసం లేక పోవడంతోనే మార్కెట్లో విక్రయాలు

(కంచికచర్ల - ఆంధ్రజ్యోతి)

మద్దతు ధరతో సమానంగా బయట మార్కెట్లో ధర లభిస్తుండటంతో శనగ రైతులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం వైపు కన్నెత్తి చూడటం లేదు. కేంద్రం తెరిచి వారం రోజులైనప్పటికీ రైతులు మార్క్‌ఫెడ్‌కు ఒక్క గింజ కూడా అమ్మలేదు. రైతులందరూ ప్రైవేట్ వ్యాపారులకు శనగలు విక్రయిస్తుండటంతో కొనుగోలు కేంద్రం వెలవెలబోతోంది. నందిగామ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో 85 వందల ఎకరాల్లో రైతులు శనగ పంటను సాగుచేశారు. ఎకరానికి సగటున రూ. 30 వేల నుంచి రూ. 35 వేలవరకు పెట్టుబడి పెట్టారు. పైరు పూత, పిందె దశలో ఉన్నప్పుడు కురిసిన కొద్దిపాటి జల్లులకు పంట దెబ్బతిన్నది. దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి పది క్వింటాళ్లు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్క్‌ఫెడ్ డీఎం నాగమల్లిక (ఫైల్ ఫొటో)

రావాల్సిన దిగుబడి ఐదారు క్వింటాళ్లకు మించి రాలేదు. శనగలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ. 5,650లు. కొద్ది రోజుల క్రితం శనగ పంట కోతలు పూర్తయ్యాయి. నాణ్యత బాగుండటంతో వ్యాపారులు క్వింటా రూ. 55 వందల వంతున కొనటం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18న స్థానిక మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని డీఎం కె.నాగమల్లిక ప్రారంభించారు. వారం రోజులు గడిచినప్పటికీ రైతులెవరూ కొనుగోలు కేంద్రం వైపు చూడటం లేదు. బయటి మార్కెట్లో వ్యాపారులు రూ. 56 వందలకు కొంటున్నందున రైతులు మార్క్‌ఫెడ్‌కు అమ్మేందుకు ఆసక్తి చూపటం లేదు. దీనికితోడు కొన్ని నిబంధనలు ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. మార్క్‌ఫెడ్‌కు శనగలు అమ్మాలనుకున్న రైతులు ముందుగా సీఎం యాప్‌లో పేరు నమోదు చేయించుకోవాలి. తమకు కేటాయించిన తేదీల్లో సరుకు తీసుకువచ్చి కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవాల్సి ఉంది. యంత్రాలతో నూర్పిళ్లు చేయించినందున మట్టి, రాళ్లు ఎక్కువగా ఉన్నాయంటూ, ఒకటికి రెండుసార్లు జల్లెడ వేయించి రాళ్లు లేకుండా చూడాలని మార్క్‌ఫెడ్ అధికారులు సూచిస్తున్నారు. మద్దతు ధరకు, బయటి ధరకు కేవలం రూ. 50లు మాత్రమే తేడా ఉండటంతో రైతులు వ్యాపారులకు అమ్ముతున్నారు. మున్ముందు ధర పెరుగుతుందన్న ఉద్దేశ్యంతో పలువురు రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. దీంతో కొనుగోళ్లు జరగకపోవటంతో కేంద్రం బోసిపోతున్నది.

ఈనెల 17న స్థానిక మార్కెట్ యార్డును సందర్శించిన డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీతను కలిసి మార్క్‌ఫెడ్‌కు శనగలు అమ్మే ప్రసక్తే లేదంటూ పలువురు రైతులు ముందుగానే చెప్పటం విశేషం. మద్దతు ధరకు అమ్మితే నష్టం తప్పితే రూపాయి కూడా మిగలదని రైతులు వివరించారు. సాగుకోసం శనగ విత్తనాలను 30శాతం రాయితీపై క్వింటా రూ.ఏడువేల వంతున విక్రయించిన ప్రభుత్వం ఇప్పుడు మద్దతు ధరకు కొనటం వల్ల నష్టం తప్పితే రూపాయి కూడా మిగలదని రైతులు పేర్కొంటున్నారు.

బ్యారక్‌లో ఒంటరిగానే వంశీ

» భద్రత దృష్ట్యా ఇతరులను అనుమతించం
» సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో న్యాయాధికారి స్పష్టీకరణ
» 8 వరకూ రిమాండ్ పొడిగింపు



విజయవాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌తోపాటు మిగిలిన నిందితులందరికీ రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. కిడ్నాప్ కేసులో నిందితులుగా ఉన్న వల్లభనేని వంశీ, వెలినేని వెంకట శివరామకృష్ణప్రసాద్, నిమ్మ చలపతి, గంటా వీర్రాజు, వేల్పూరు వంశీల రిమాండ్ ముగియడంతో మంగళవారం వీరిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఏప్రిల్ 8వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తున్నట్టు న్యాయాధికారి హిమబిందు ఆదేశాలిచ్చారు. కోర్టుహాల్లోకి వచ్చిన తర్వాత... 'చెప్పుకోవాల్సింది ఏమైనా ఉందా?' అని వంశీని న్యాయాధికారి హిమబిందు అడిగారు. తనను జైల్లో ఒంటరిగా ఒక బ్యారక్‌లో పెట్టారని వంశీ చెప్పారు. బ్యారక్‌లోకి ఇతర ఖైదీలను కాకపోయినా తనతో పాటు అరెస్టయిన వారిలో ఒకరినైనా అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వెన్నునొప్పి కారణంగా కూర్చోవడానికి కుర్చీ ఏర్పాటు చేయాలని అడిగారు. బ్యారక్‌లోకి భద్రత దృష్ట్యా మరొకరిని అనుమతించలేమని స్పష్టం చేసిన న్యాయాధికారి... కుర్చీని ఏర్పాటు చేయాలని జైలు అధికారులకు ఆదేశాలిస్తామని తెలిపారు. కాగా, కోర్టు ఆదేశాలమేరకు దర్యాప్తు అధికారి విజయవాడ సెంట్రల్ ఏసీపీ కె.దామోదరరావు కోర్టుకు హాజరయ్యారు.

'దాడి' కేసులో బెయిల్‌పై తీర్పు రిజర్వ్

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తీర్పును సీఐడీ న్యాయస్థానం ఈనెల 27కి రిజర్వ్ చేసింది. ఈ కేసులో వంశీ 72వ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులోనూ ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసిన తర్వాత సీఐడీ అధికారులు పీటీ వారెంట్‌పై వంశీని కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ కేసులో రిమాండ్ విధించాక బెయిల్ మంజూరు చేయాలని సీఐడీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రాసిక్యూషన్, వంశీ తరపున న్యాయవాది డాక్టర్ వి.దేవీసత్యశ్రీ కోర్టులో మంగళవారం వాదనలు వినిపించారు. వాదనలు విన్న అనంతరం తీర్పును ఈనెల 27వ తేదీకి రిజర్వు చేస్తున్నట్టు న్యాయాధికారి తిరుమలరావు వెల్లడించారు.

పెట్టమంటే ఒకటి.. పెట్టొద్దంటే మరోటి అంటారు

జైలు నుంచి వంశీతో పాటు మిగిలిన నలుగురు నిందితులను ఉదయం 10 గంటలకు ఎస్కార్టు సిబ్బంది కోర్టుకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు వారికి రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి హిమబిందు ఆదేశాలిచ్చారు. రికార్డులపై సంతకం చేసి ఆమె బెంచ్ దిగి చాంబర్‌కు వెళ్తుండగా ఎస్కార్ట్ సిబ్బంది న్యాయాధికారితో మాట్లాడారు. 'నిందితులకు ఇప్పటి వరకు భోజనం పెట్టలేదు. ఇక్కడ భోజనం పెట్టాక జైలుకు తీసుకెళ్లమంటారా? జైలుకు తరలించిన తర్వాత పెట్టమంటారా?' అని అడిగారు. 'పెట్టమంటే ఒకటి అంటారు, పెట్టొద్దంటే మరొకటి అంటారు' అని నవ్వుతూ వ్యాఖ్యానించి భోజనం పెట్టి జైలుకు తరలించమని ఎస్కార్ట్ సిబ్బందికి చెప్పారు.

కోర్టుకు హాజరైన దర్యాప్తు అధికారి

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో దర్యాప్తు అధికారిగా ఉన్న విజయవాడ సెంట్రల్ ఏసీపీ కె.దామోదరరావు కోర్టుకు హాజరయ్యారు. కొద్దిరోజుల క్రితం దర్యాప్తు అధికారి కోర్టుకు హాజరు కావాలని న్యాయాధికారి హిమబిందు ఆదేశించారు. వంశీ రిమాండ్ పొడిగింపునకు సంబంధించిన మెమోలను న్యాయాధికారి ముందు పెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎవరూ కోర్టు హాల్లోకి రాకపోవడంతో వాటిని పక్కన పెట్టారు. తర్వాత కాసేపటికి పటమట ఇన్‌స్పెక్టర్ పవన్‌కిశోర్ హాజరయ్యారు. భోజన విరామ సమయం కావడంతో న్యాయాధికారి బెంచ్ దిగి చాంబర్‌లోకి వెళ్లిపోయారు. న్యాయాధికారి బెంచ్ మీదకు వచ్చిన తర్వాత దర్యాప్తు అధికారి దామోదరరావు, ఆమె ముందు హాజరయ్యారు. 'రిమాండ్ పొడిగింపునకు మెమోను దాఖలు చేసినప్పుడు ప్రాసిక్యూషన్ తరఫున గానీ, పోలీసుల తరఫున గానీ ఎవరో ఒకరు హాజరుకావాలి కదా?' అని న్యాయాధికారి అన్నారు. ఇన్‌స్పెక్టర్ హాజరయ్యారని ఏసీపీ జవాబు ఇచ్చారు. 'కేసు దర్యాప్తు అధికారి ఇన్‌స్పెక్టర్ కాదు కదా? ఇక నుంచి ఇటువంటివి జరగకుండా చూసుకోవాలి' అని న్యాయాధికారి సూచించారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు, చోరీ సొత్తు

రైళ్లలో చోరీ దొంగల అరెస్టు

» రూ.15.65 లక్షల ఆభరణాలు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

రైల్వేస్టేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణికుల వద్ద విలువైన వస్తువులు, నగదు చోరీకు పాల్పడుతున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు రైల్వే పోలీసు అధికారి జేవీ రమణ తెలిపారు. ఈ మేరకు విజయవాడ స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా, నిజాం పేటలోని శ్రీనివాసమ్ అపార్టుమెంట్‌లో కుటుంబసభ్యులతో నివాసం ఉంటోన్న గుడిమెంట్ల భానుప్రియ హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. సామర్లకోటలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి ఆమె కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 13న గౌతమీ ఎక్స్‌ప్రెస్ (12738 కోచ్ నెం.ఎస్1, బెర్త్ నెం.65)లో బయలుదేరింది. రాయనపాడు వద్దకు వచ్చేసరికి ఆభరణాలు, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను భద్రపరచిన బ్యాగ్ చోరీకి గురైంది. బాధితురాలు ఈనెల 16న జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన బి.టెక్ చదివి వ్యసనాలకు బానిసైన పుచ్చకాయల నరేష్ (25) అదే గ్రామానికి చెందిన అతడి స్నేహితుడు షేక్ హైమద్ (25) చోరీకి పాల్పడినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌లో నిందితులు ఉన్నట్టు సమాచారం తెలుసుకుని సోమవారం అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.15లక్షల 65వేల విలువ చేసే 217 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ ఆలీబేగ్, ఎస్ఐ మఫత్‌లాల్ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు. నిందితులపై ఖమ్మం, విజయవాడ గవర్నర్‌పేట స్టేషన్లలో కేసులు ఉన్నట్టు సీఐ తెలిపారు.



కొండగట్టు వద్ద అక్రమ క్వారీ, పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీలు

మట్టి లారీలు స్వాధీనం

» వైసీపీ సర్పంచ్‌పై కేసు నమోదు

ఎ.కొండూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఏడాది నుంచి యథేచ్ఛగా జరుగుతున్న మట్టి తరలింపుపై ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. మండలంలోని గోపాలపురం, గొల్లమందల గ్రామ రెవెన్యూ పరిధిలోని కొండగట్టు ప్రాంతం నుంచి మట్టి తరలిస్తున్న మాఫియాపై గతంలో 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించింది. అర్ధరాత్రి సమయంలో గోపాలపురం వైసీపీ సర్పంచ్ కోలా శ్రీను, కొందరు పెద్దల అండతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. లారీకి రూ. 8వేలు నుంచి 9 వేల వరకు.. దూర ప్రాంతాలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు వసుళ్లు చేస్తున్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వైసీపీ నేతలు కొందరు అధికార పార్టీ నేతలు కలిసి భారీగా మట్టి మాఫియాతో లక్షలాది రూపాయలు ప్రభుత్వ ధనం దోచుకుంటున్నారు. మంగళవారం రాత్రి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా ఎ.కొండూరు ఎస్ఐ చల్లా కృష్ణ సిబ్బందితో దాడిచేయగా మూడు లారీలు, నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. లారీలను స్టేషన్‌కు తరలించారు. వైసీపీ సర్పంచ్ కోలా శ్రీను, డ్రైవర్లు బత్తుల శ్రీనివాస్, వేములకొండ శ్రీనివాస్, మాళావతు కిషోర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల అదుపులో గ్యాంగ్ వార్ పండు

» 22 కిలోల గంజాయితో చిక్కిన రౌడీషీటర్
» రాజమండ్రి నుంచి విజయవాడ తరలిస్తుండగా దాడి
» మరో ముగ్గురు అనుచరుల అరెస్టు.. రిమాండ్



కేటీఎం పండు

పెనమలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ గ్యాంగ్‌వార్‌లో ప్రధాన నిందితుడు కేటీఎం పండు పోలీసులకు పట్టుబడ్డాడు. 22కిలోల గంజాయి తరలిస్తూ పెనమలూరు పోలీసులకు చిక్కాడు. అతడి అనుచరులు మరో ముగ్గురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో పెనమలూరు పోలీసులు ఎస్ఐ రమేష్ నేతృత్వంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఓ ఆటోలో కేటీఎం పండు పోలీసుల కంటపడ్డాడు. అతడి నుంచి రూ.లక్షకు పైగా విలువచేసే 22కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పండుతో పాటు యనమలకుదురు గ్రామానికి చెందిన నరేలా రామారావును, వీరికి సహకరించిన కొక్కిలిగడ్డ పవన్‌కుమార్, రాజుపై కేసులు నమోదు చేశారు. రాజమండ్రి నుంచి విజయవాడకు గంజాయిని విక్రయించేందుకు తరలిస్తున్నట్టు విచారణలో పండు తెలిపినట్టు పోలీసులు వెల్లడించారు. ఆటోలో ఉన్న ఎనిమిది బ్యాగులు, నాలుగు ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అలాగే తాడిగడప డొంకరోడ్డులోని ఒక క్రికెట్ నెట్ వెనుక పోలీసులకు అందిన సమాచారంతో దాడులు నిర్వహించగా గంజాయి పంచుకొంటున్న ముగ్గురు పండు అనుచరులు కళింగపట్నం మనోహర్, మారుబోయిన నాగరాజు, ఉసురుమోతు పవన్‌కళ్యాణ్‌లు పట్టుబడ్డారు. వారి నుంచి తొమ్మిదివేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి కార్యకలాపాలు..!

విజయవాడ గ్యాంగ్‌వార్‌లో ప్రధాన నిందితుడు, పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న కేటీఎం పండు తన కార్యకలాపాలను గంజాయి వ్యాపారంలోకి మార్చుకున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. గత ఏడాది ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లలో బీరు సీసాతో యువకుడిపై దాడికి తెగబడ్డ పండుపై పోలీసులు పీడీ యాక్టు మోపి రిమాండుకు తరలించారు. అనంతరం కనిపించకుండా పోయిన పండు అనుచరులతో కలిసి డబ్బు సంపాదన కోసం గంజాయి వ్యాపారంలోకి దిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

వంశీ కస్టడీ పిటిషన్‌పై వాదనలు నేడు

గన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కస్టడీ పిటీషన్‌పై వాదనలను న్యాయాధికారి బుధవారానికి వాయిదా వేశారు. ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన రైల్వే కాంట్రాక్టర్ శనగల శ్రీధర్‌రెడ్డి ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే వంశీతో పాటు అతని అనుచరుల మీద కేసు పెట్టారు. ఫోర్జరీ సంతకాలు చేసి, బెదిరించి, కుట్రపూరితంగా నకిలీ పత్రాలు సృష్టించి ఒకరి భూమిని మరొకరి చేతుల్లో పెట్టి తనకు చెందాల్సిన ఆస్తిని దక్కకుండా అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్యే వంశీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఏప్రిల్ 1 వరకు గన్నవరం కోర్టు రిమాండ్ విధించింది. దీంతో ఆత్కూరు పోలీసులు వల్లభనేని వంశీని ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని గన్నవరం కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. నిందితుడి నుంచి కేసులో మరిన్ని వివరాలు సేకరించేందుకు కస్టడీ కోరగా న్యాయమూర్తి ఇరుపక్షాల వాదనలు వినేందుకు వాయిదా వేశారు. బుధవారం వాదనలు జరగనున్నాయి.

స్పిరులినాతో ప్రయోజనాలెన్నో..

» ప్రయోగాత్మకంగా తయారు చేస్తున్నరైతులు
» ప్రభుత్వం ప్రోత్సహిస్తే నిరుద్యోగులకు ఉపాధి
» మార్కెటింగ్ కల్పించాలని పలువురి వినతి

(ఆంధ్రజ్యోతి-మోపిదేవి) : అరుదుగా కనిపించే స్పిరులినా(నాచు మొక్క) తయారీ మోపిదేవి మండలంలో రైతులకు కాసులు కురిపిస్తోంది. ఆర్గానిక్ పద్ధతిలో స్పిరులినాను తయారు చేసి ఆక్వా రైతులకు విక్రయిస్తున్నారు. కేజీ రూ.750ల చొప్పున రాష్ట్రంలోనే ఆక్వా ప్రముఖంగా ఉన్న భీమవరం, పాలకొల్లు, ఆకివీడు ప్రాంతాల రైతులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సహించి దీనికి మార్కెటింగ్ కల్పిస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం :

వంశీ

వెంకటాపురం గ్రామానికి చెందిన చిరువోలు వంశీ ప్రయోగాత్మకంగా ఆర్గానిక్ పద్ధతిలో స్పిరులినా (నాచు మొక్క) తయారు చేస్తున్నారు. స్వంత వ్యవసాయ పొలంలో 15 సెంట్ల స్థలంలో రెండు పాండ్లు ఏర్పాటుచేసి రెండులక్షల లీటర్ల నీటిసామర్థ్యంతో స్పిరులినా తయారు చేస్తున్నారు. 15 రోజుల తర్వాత స్పిరులినా పక్వానికి వస్తుందని, ఒకసారి విత్తనం వేస్తే పదేళ్ల వరకు తయారు చేయవచ్చన్నారు. రోజుకు 9కిలోలు నాచు తయారవుతుందని, దానిని పొడిగా చేసి ప్యాకింగ్ ద్వారా ఆక్వా రైతులకు కేజీ రూ.750ల చొప్పున విక్రయిస్తున్నట్టు చెప్పారు. భీమవరం, పాలకొల్లు, ఆకివీడు ప్రాంతాల రైతులు దీనిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారన్నారు.



స్పిరులినాను ఆరబెడుతున్న రైతులు

రైతుల నుంచి డిమాండ్

- నిమ్మకూరి శ్రీనివాసరావు

ఆక్వా రైతుల నుంచి స్పిరులినాకు మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం దివిసీమ ప్రాంతంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆక్వా ఫ్యాక్టరీలకు, రైతులకు ప్యాకెట్ల రూపంలో అందిస్తున్నాం. అధిక ప్రోటీన్లు కలిగి, చేపలు, రొయ్యల పెరుగుదలకు ఇది దోహదపడుతుంది.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 405

మహిళలపై హింస అరికట్టాలి : ఐద్వా

ఉయ్యూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలు, మహిళలపై అత్యాచారాలు పెచ్చుమీరిపోతున్నాయని ఐద్వా జిల్లా సహాయకార్యదర్శి బి కీర్తి ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మంగళవారం ఉయ్యూరులో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ, జి కొండూరు బాలికను, గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. ఐద్వా సభ్యులు మల్లమ్మ, వీరమ్మ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఉయ్యూరులో ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీ

దోపిడీ కేసులో నిందితులకు జైలు

గన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముగ్గురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముస్తాబాద శివారు రిలయన్స్ గోదాము వద్ద గతేడాది ఆగస్టు 26న రాత్రి కుక్కల వెంకటేశ్వర్లు తన మరదలతో కలసి విజయవాడ వైపు నుంచి వస్తున్నారు. వారిని నలుగురు వ్యక్తులు బెదిరించి వారి వద్దనున్న బంగారు నగలు, ఫోన్ బలవంతంగా తీసుకుని పారిపోయారు. బాధితుడు గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. విజయవాడకు చెందిన పాలపర్తి వెంకన్న, నల్లగొండ సురేష్, నక్కా గోపిలను నిందితులుగా గుర్తించి గన్నవరం 8వ అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం సాక్షులను విచారించగా నేరం రుజువు కావటంతో ముగ్గురి కి మూడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నాలుగవ ముద్దాయి కట్టా దుర్గారావు అరెస్టు పెండింగ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థికస్వావలంబన సాధించాలి

గన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించా లని హెచ్‌సీఎల్ టెక్నాలజీ అడ్మిన్ శ్రీనివాసరావు అన్నారు. వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో దావాజీగూడెంలో 30 మంది మహిళలకు కు ట్టుశిక్షణ ఇచ్చి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రూ.2.16 లక్షలు విలువ చేసే కుట్టు మిషన్‌లను లబ్ధిదారులకు అందజేశారు.

ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

పోరంకి ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ముస్లింల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మంగళవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో రంజాన్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలకు ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ముస్లింలు చేసిన కృషి మరువ లేనిదన్నారు. పేద ముస్లిం కుటుంబాలలో అవసరాల కోసం యనమలకుదురులో, ఉయ్యూరులో లక్షల వ్యయంతో త్వరలో షాదీఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో గోసాల గ్రామంలో ఐదున్నర కోట్ల విలువైన స్థలాన్ని ఈద్గాకు కేటాయించడం జరిగిందని, ఈడుపుగల్లులో మసీదు నిర్మాణానికి తాను పాతిక లక్షల నిధులను కేటాయించానని తెలిపారు. గంగూరులో షాదీఖానా నిర్మాణానికి మూడున్నర కోట్ల విలువైన భూమిని ప్రైవేటు వక్తి వద్ద నుంచి ముస్లిం సమాజానికి రిజిస్ట్రేషన్ చేశామని గుర్తుచేశారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి తాను ఒక విశాలమైన స్థలంలో ఈద్గా, షాదీఖానాల నిర్మాణాలకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. షుమారు రెండు వేలకు పైగా ముస్లింలు పాల్గొన్న ఇఫ్తార్ విందులో పవిత్ర ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పోరంకిలో జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

దాయారా మసీదులో..

ఉయ్యూరు : దాయారా మసీదులో మంగళవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, నగర పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, జలీల్, మాజీ ఏఎంసీ చైర్మన్ అబుకలాం తదితరులు పాల్గొని సేవలందించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ముస్లిం పెద్దలు పాల్గొని సేవలందించారు.

మతసామరస్యానికి ప్రతీక..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : పవిత్ర ఖురాన్ ఆవిర్భవించిన రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయతతో కూడిన మతసామరస్యానికి ప్రతీక అని ఎమ్మెల్యే సోదరుడు యార్లగడ్డ సతీష్ అన్నారు. మల్లవల్లిలో సయ్యద్ కాలీషావలి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీడీపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్యప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, కార్యదర్శి పుట్టా సురేష్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యనమదల వెంకయ్యారావు, తూము రాధాకృష్ణమూర్తి, అక్కినేని కృష్ణాజీ, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు షేక్‌జాన్ బాషా, షేక్ మీర్జావలి, తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు దాయారా మసీదులో.. మల్లవల్లి సయ్యద్ కాలీషావలి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

పారిశుధ్య నిర్వహణపై అలసత్వం వద్దు

డీపీవో డాక్టర్ జె.అరుణ

గన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వాహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని డీపీవో డాక్టర్ జె.అరుణ హెచ్చరించారు. స్థానిక పంచాయతీలో పారిశుధ్య పనులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తడి, పొడి చెత్త సేకరణ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై గ్రామస్తులతో మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా డస్ట్‌బిన్‌లలో వేసి ఉదయం పూట పంచాయతీ కార్మికులు రాగానే ఆ రిక్షాలో వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీపీవో అరుణ మాట్లాడుతూ, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యపడుతుందన్నారు. గ్రామస్తులు కూడా పంచాయతీ వారికి సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.


గన్నవరంలో తడి, పొడి చెత్తను పరిశీలిస్తున్న డీపీవో జె.అరుణ

వాట్సప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఉయ్యూరు ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు

ఉయ్యూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన వాట్సప్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వాట్సప్ సేవల స్కానర్, మనమిత్ర 955230 0009 సెల్ నంబరును ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రకాల ధృవపత్రాలు వాట్సప్‌లోనే అందజేస్తారని ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్కానర్‌ను అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. ● మండల పరిధిలో ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో 2023-2024 సంత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు.


పభుత్వ వాట్సప్ సేవల స్కానరు ప్రదర్శిస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు

పెదఅవుటపల్లిలో రీసర్వే గ్రామసభ రేపు

ఉంగుటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదఅవుటపల్లి వీఆర్వో కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ గురువారం ఉదయం 9గంటల నుంచి రీసర్వే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జాలాది విమలకుమారి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మండల పరిధిలో మొత్తం 30 రెవెన్యూ గ్రామాలకుగాను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 25గ్రామాల్లో రీసర్వే చేపట్టడం జరిగిందన్నారు. మిగిలిన మానికొండ, ఆత్కూరు, పెదఅవుటపల్లి, తేలప్రోలు, కొయ్యగూరపాడు గ్రామాల్లో రీసర్వే నిర్వహించాల్సి వుండగా ప్రస్తుతం పెదఅవుటపల్లిలో రీసర్వే జరుగుతోందని తెలిపారు.

ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాలి

బాపులపాడు మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీలు

హనుమాన్‌జంక్షన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగు నీటి సమస్యలు రాకుండ తగిన చర్యలు తీసుకోవాలని బాపులపాడు ఎంపీపీ వై.నగేష్ అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను బ్లాక్ లెవల్ డెవలప్‌మెంట్ ప్రణాళికపై ఎంపీటీసీ సభ్యులతో ఎంపీడీవో కె.జోగేశ్వరరావు సమావేశం నిర్వహించారు. రానున్న కాలంలో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనలు స్వీకరించి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా బొమ్ములూరు, పెరికీడు, ఉమామహేశ్వరపురం, ఏ.సీతారాంపురం, రేమల్లె గ్రామాల్లో దశాబ్దాల కిందట నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయని వాటిని స్థానంలో కొత్త ట్యాంకులు నిర్మించాలని ఆయా ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం అందించే రూ.90 లక్షలకు సరిపడ పనుల ప్రణాళికపై సమీక్ష చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు కె.గంగాభవాని, ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, అమ్ముతపల్లి సూర్యానారాయణ, పడకల కోటయ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ తానీషా, పీఆర్ ఏఈ జయరాజు, ఏవో త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నేతలు

పి.నైనవరంలోనే ఇళ్లస్థలాలు ఇవ్వాలి

తహసీల్దార్‌కు ప్రజా సంఘాల వినతి

విజయవాడ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామంలోనే నివేశనా స్థలాలు కేటాయించాలని విజయవాడ రూరల్ మండలం పి. నైనవరం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కుక్కలకుంట వారి చెరువు సమీపంలోని ప్రభుత్వ భూమిలోనే పి. నైనవరం వాసులకు ఇళ్ల కేటాయించాలని కోరుతూ ప్రజా సంఘాల నేతలు మంగళవారం రూరల్ తహసీల్దార్ సుగుణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతున్న స్థలానికి, చెరువుకు మధ్యలో 100 ఏళ్ల క్రితమే ఆర్ అండ్ బీ రోడ్డు ఏర్పాటు చేశారని, చెరువుకు సంబంధం లేకుండా ఖాళీగా ఉన్న స్థలాన్ని పేదలకు ఇళ్లస్థలాలకు కేటాయించాలని తహసీల్దార్‌ను కోరారు. ఆయనను కలసిన వారిలో నేతలు కోట కల్యాణ్, మాతంగి ఆంజనేయులు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● కాగా స్థానికులు తమకు ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరుతున్న స్థలం ఇరిగేషన్ పరిధిలోకి వస్తుందని, ఆ భూమిని ఇళ్లస్థలాలకు కేటాయించడం కుదరదని తహసీల్దార్ సుగుణ తెలిపారు.

ప్రజాదర్బార్ నేడు

పెనమలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపల్ కార్యాలయంలో నేడు ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అధ్యక్షతన ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు కమిషనర్ భవానీ ప్రసాద్ తెలిపారు. ప్రజలందరూ తమ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీల ద్వారా నివేదించుకోవచ్చని, ఉదయం పది నుంచి 12 గంటల వరకు జరిగే ప్రజాదర్బారులో సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతారని తెలిపారు.

ఆశీల బహిరంగ వేలం..

ఉయ్యూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో 2025- 2026 సంవత్సరానికి రోజువారీ ఆశీలు వసూలు చేసుకునేందుకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం నగర పంచాయతీ కార్యాలయంలో ఈ పాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.


మానవత కార్యాలయంలో విరాళం అందిస్తున్న మారుబోయిన కోటేశ్వరరావు

మానవత ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కళలు కళారూపాలను బతికించాల్సిన అవసరం మనకు ఎంతైనా ఉందని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో ఏలూరులోని అభినయ నృత్య భారతి సంస్థకు మారుబోయిన రూ. 25వేలు ఆర్థికసాయం అందజేశారు. సంస్థ నిర్వాహకుడు హేమసుందర్‌కు విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సెంట్రల్ కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, జంక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు వ్యక్తిగత భద్రత అవసరం

హనుమాన్‌జంక్షన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నిరంతరం వార్తా సేకరణలో తలమునకలు అయ్యే జర్నలిస్టులు వ్యక్తిగత భద్రత పట్ల కూడా శ్రద్ధ తీసుకోవాలని పుట్టగుంట వెంకట సతీష్‌కుమార్ హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ పుట్టగుంట సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఇక్కడ తన కార్యాలయంలో జంక్షన్‌లో పనిచేస్తున్న విలేకరులకు ఒక్కొక్కరికి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన రూ.15లక్షలు ప్రమాద బీమా పాలసీ పత్రాలను అందజేశారు. లయన్స్ క్లబ్ నాయకులు అట్లూరి శ్రీనివాస రావు, తాడి రంగారావు, కాసులు పాల్గొన్నారు.

మహనీయుడు మండేపూడి

కంకిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై ఉద్యమించిన మహనీయుడు మండేపూడి నాగభూషణ్‌రెడ్డి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పంచకర్ల రంగారావు అన్నారు. స్థానిక మండేపూడి నాగభూషణ్‌రెడ్డి భవన్‌లో ఆయన 47వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిత్యం ఉద్యమించిన వ్యక్తి నాగభూషణ్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్, వి. శివశంకర్, ఎం. శ్రీనివాసరావు, కె. నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాకులపాడులో ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : కాకులపాడులోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థాన ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి 6వ వార్షిక మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రతిష్టాదాత యలమంచిలి వసంతకుమార్ దంపతులు గ్రామాభ్యుదయార్థం స్వామివారికి క్షీరాభిషేకం, సుద్దోదకస్నపనము నిర్వహించారు. అనంతరం స్వామి వారికి వడమాల, అప్పాలమాల, గజమాలలతో అలంకరించి సహస్రనామ సహిత మన్యుసూక్త సహితంగా అన్నకుంభ సమర్పణ నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు వీరపనేని రాజా, చలసాని పూర్ణబ్రహ్మయ్య, దొప్పలపూడి వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు, జాస్తి భూపతిరావు, రంగారావు, సుబ్రహ్మణ్యం, రాఘవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



హనుమాన్‌జంక్షన్ : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు స్వామి వారికి పూజా కార్యక్రమాలు జరిపారు. ఆలయ ఈవో తారకేశ్వరావు పర్యవేక్షణలో ఈ సందర్భంగా జంక్షన్‌కు చెందిన ఆర్యవైశ్య సంఘం నేత తవ్వా కుటుంబరావు లక్ష్మీసుజాత దంపతులు 200మందికి భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు.

లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేదిక ప్రారంభం నేడు

గన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ వేదిక ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జాస్తి చౌదరయ్య, సుశీలాదేవి సౌజన్యంతో నిర్మించబడిన కళ్యాణ వేదికను బుధవారం ఉదయం 10.35 గంటలకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరీ దంపతులు ప్రారంభిస్తారని ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో 500 మంది సామర్థ్యంతో ఆలయ కార్యక్రమాలు, గ్రామస్తుల శుభకార్యాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫంక్షన్ హాలు నిర్మాణం చేసినట్లు చెప్పారు. భక్తులందరు పాల్గొని అమ్మవారి ఆశీసులు పొందాలని కోరారు.



మిర్చిఘాటుతో ఉక్కిరిబిక్కిరి

జగ్గయ్యపేట: తొర్రగుంటపాలెంలో సాయి తిరుమలగిరి అగ్రి ప్రోడక్ట్స్ ప్రై.లి. కోల్డ్ స్టోరేజిలో అగ్నిప్రమాదం జరగటంతో సోమవారం అర్ధరాత్రి జగ్గయ్యపేట శివారు ప్రాంతాల్లో కల్లోలం రేపింది. ఆ ఘాటు (కోరు)కు ఆటోనగర్‌పై జాతీయరహరి వెంబడి సాయి నగర్, శాంతినగర్, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో ప్రజలు దగ్గుతో ఉక్కిరిబిక్కిరయ్యారు. కొంతమంది ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యకు ఫోన్ చేయటంతో ఆయనకు అప్పటికే కోల్డ్ స్టోరేజి ప్రమాదం జరగిందని ఆందోళన చెందవద్దని సమాధానపరిచారు. ఆయన స్వయంగా షేర్‌మహ్మద్‌పేట, శాంతినగర్ వాసులను కలిసి వివరించారు

యజమాని, స్టాక్ రిజిస్టర్ అదృశ్యం

అగ్ని ప్రమాదానికి గురైన కోల్డ్ స్టోరేజి యజమాని రావూరి శ్రీనివాస రావు అధికారులకు అందుబాటులోకి రాలేదు. ప్రమాదంపై సోమవారం అర్ధరాత్రి ఫైర్ అధికారులకు ఫిర్యాదు చేసిన తర్వాత కనిపించలేదు. అధికారులు ఫోన్ చేసినా స్పందన లేదు. కలెక్టర్ ఆదేశాలతో విచారణకు వచ్చిన జిల్లా మార్కెటింగ్‌శాఖ ఏడీఏ మంగమ్మ రికార్డులు పరిశీలించేందుకు రాగా సిబ్బంది సహకరించలేదు.

రైతుల ఆందోళన

అగ్ని ప్రమాదం విషయం మంగళవారం ఉదయానికి తెలియటంతో రైతులు పెద్దఎత్తున కోల్డ్‌స్టోరేజి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. మిర్చి ధర తగ్గిందని కోల్డ్ స్టోరేజిలో పెట్టుకుంటే ఇప్పుడు అది కాస్త అగ్నికి ఆహుతైందని తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు.

మంటలు ఆర్పేందుకు ప్రయత్నాలు

కోల్డ్ స్టోరేజిలో మంటలు ఆర్పేందుకు అధికారులు ప్రయత్నించినా మంగళవారం సాయంత్రం వరకు అదుపులోకి రాలేదు. వేసవి గాలులు వీస్తుండటంతో ఒకవైపు ఆర్పుతుండగా మరోవైపు మంటలు చేలరేగుతున్నాయి. లోలోపల మిర్చి రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. దట్టమైన పోగలు వస్తూనే ఉన్నాయి. జాతీయరహదారిపై కీసర వద్ద ఉన్న సెంధిని బయో స్పిరిట్స్ నుంచి సీఓ2 ట్యాంకర్ తెప్పించి మంటలు ఆర్పేందుకు యత్నించారు.

కోల్డ్ ఫైర్



కోల్డ్ స్టోరేజీ



డీప్ కూల్ చాంబర్

కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్వహణలో రాజ్యమేలుతున్న యాజమాన్యాల నిర్లక్ష్యం

- అమ్మోనియం గ్యాస్‌తో తరచూ అగ్ని ప్రమాదాలు, సరుకు బుగ్గిపాలు
- ఫైర్ ఎన్‌వోసీలు, కనీస రక్షణ చర్యలు లేకుండా నిర్వహణ
- ఎన్టీఆర్ జిల్లాలో 17 కోల్డ్ స్టోరేజీలు.. సింహభాగం నిబంధనలకు విరుద్ధం
- అగ్ని ప్రమాదాలు సంభవిస్తే.. అన్నదాతకు కడగండ్లు



కోల్డ్ స్టోరేజీలో ఉన్న మిర్చి

నందిగామ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్వహణలో యాజమాన్యాలు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 17 కోల్డ్ స్టోరేజ్‌లు ఉన్నాయి, ఒక్కొక్కటి సరాసరి లక్ష బస్తాల సామర్థ్యం కలిగి ఉన్నాయి. గతంలో చిన్న ఘటనలు జరిగినప్పటికీ, ఇటువంటి భారీ స్థాయిలో స్టోరేజ్ దగ్ధం కావడం ఇదే మొదటిసారి. అధికారులు, స్టోరేజ్ యాజమాన్యాలు ఇప్పటికైనా అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. ఒక కోల్డ్‌స్టోరేజ్ అగ్నికి ఆహుతైతే నష్టం రూ.కోట్లలో ఉంటుంది. వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోతారు. కోల్డ్‌స్టోరేజ్‌లలో అగ్ని ప్రమాదాలకు ప్రధాన కారణం యాజమాన్యాల నిర్లక్ష్యమైన నిర్వహణ. అమ్మోనియం గ్యాస్ ట్యాంకర్, పైప్‌లైన్ నిర్వహణలో అనుభవం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. గిడ్డంగులను శీతలపరిచే అమ్మోనియం గ్యాస్ అనేక సందర్భాల్లో ప్రమాదానికి దారితీస్తోంది. స్టోరేజ్ పక్కనున్న అమ్మోనియం ట్యాంక్ నుంచి గ్యాస్ పైప్‌లైన్ల ద్వారా ప్రవహించి లోపలున్న సరుకును చల్లగా ఉంచుతుంది. అయితే, అమ్మోనియం గ్యాస్ ట్యాంక్ లోపల ఉష్ణోగ్రత బయట ఉష్ణోగ్రత కంటే 7 డిగ్రీలు తక్కువగా ఉండాలి. లేదంటే సిలిండర్ పేలి మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. దీన్ని నివారించాలంటే అమ్మోనియం సిలిండర్‌పై గన్నీబ్యాగ్‌లు వేసి నిరంతరం నీటితో చల్లబరచాలి. ముఖ్యంగా వేసవిలో పూర్తి అప్రమత్తంగా ఉండాలి. నాణ్యమైన సిలిండర్ల వినియోగంతోనే ప్రమాదాలు తగ్గించవచ్చు. అయితే, ఆర్థికభారం తగ్గించేందుకు స్టోరేజ్ యజమానులు నాసిరకం సిలిండర్లు వాడటంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. అలాగే, పైప్‌ల ద్వారా ప్రవహించే గ్యాస్‌ను నిరంతరం చల్లబరచడం తప్పనిసరి. అయితే, చిల్లింగ్ ప్లాంట్ల నిర్వహణలో నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు కూడా అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నాసిరకం వైరింగ్, స్విచ్‌బోర్డులు, విద్యుత్ హెచ్చుతగ్గులను నివారించే వ్యవస్థల లేమితో షార్ట్ సర్క్యూట్ ఏర్పడుతుంది. స్టోరేజ్ నిర్మాణ సమయంలోనే పలు భద్రతా నిబంధనలు విధించబడతాయి. యాజమాన్యాలు వాటిని పాటించకుండా కేవలం 4 అగ్నిమాపక సిలిండర్లు, 4 ఇసుక బక్కెట్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటాయి. వార్షిక తనిఖీల్లో అధికారులు యాజమాన్యాల నుంచి లంచం తీసుకొని ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు.

అన్నదాతలకు నష్టమే

కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణ సమయంలో బ్యాంకు రుణాలు తీసుకోవడం సాధారణం. రుణం ఇచ్చే బ్యాంకర్లు స్టోరేజ్‌కు బీమా చేయిస్తారు. ప్రమాదం జరిగితే యాజమాన్యానికి బీమా అందుతుంది. కానీ, స్టోరేజ్‌లో మిర్చి నిల్వ ఉంచిన రైతుల పరిస్థితి వేరుగా ఉంటుంది. రైతులు స్టోరేజ్‌లో మిర్చిని నిల్వ ఉంచినప్పుడు బీమా చెల్లించాలి. కానీ, ప్రమాదం జరిగితే బీమా కంపెనీలు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర మాత్రమే చెల్లిస్తాయి. అయితే, మార్కెట్‌లో మిర్చి ధర ఎప్పుడూ మద్దతు ధర కంటే ఎక్కువగా ఉంటుంది. దీంతో రైతులకు పూర్తి స్థాయి నష్టపరిహారం అందదు.

యాజమాన్యాల నిరక్ష్యం

కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు రైతుల నుంచి అద్దెతో పాటు బీమా మొత్తాన్ని వసూలు చేస్తాయి. కానీ, కొంతమంది యాజమాన్యాలు స్టోరేజ్ మొత్తానికి పూర్తి బీమా చెల్లించినా, రైతుల సరుకుకు మాత్రం నామమాత్రపు బీమా చేస్తున్నారు. దీంతో దీంతో ప్రమాదం జరిగినప్పుడు యాజమాన్యానికి బీమా మొత్తం వస్తుంది, కానీ రైతులు మాత్రం పూర్తి నష్టాన్ని భరించాల్సి వస్తుంది. ఇందులో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. యాజమాన్యాలపై సక్రమంగా నిఘా పెట్టి, పూర్తిస్థాయి భద్రతా నిబంధనలు అమలు చేయించాల్సిన అవసరం ఉంది.

కోల్డ్ స్టోరేజీల నిర్వహణపై యాజమాన్యాలు, అధికారులు సమర్థమైన చర్యలు తీసుకోవాలి. రైతులకు న్యాయం కల్గించేలా బీమా నిబంధనలను సవరించాలి. అగ్ని ప్రమాదాల నివారణకు సరైన భద్రతా ప్రమాణాలు అమలు చేసి, నిర్లక్ష్యపు నిర్వహణను అరికట్టాలి.

నిబంధనలు ఇలా ఉన్నాయి..?

ఉత్తమ ప్రమాణాలు కలిగిన వైరింగ్‌ను వినియోగించాలి. అధిక, తక్కువ ఓల్టేజ్ నియంత్రణ పరికరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. గ్యాస్ లీకేజ్ డిటెక్టర్లు తప్పనిసరిగా ఉండాలి. అమ్మోనియా, ఇతర రిఫ్రిజిరేషన్ గ్యాస్ లీకులను తక్షణమే గుర్తించే అలారమ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. కార్మికులు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు వీలుగా స్పష్టమైన మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేయాలి. నిరంతరం పరిశీలించే కెమెరాల వ్యవస్థ ఉండాలి. అనధికార వ్యక్తులు స్టోరేజ్ పరిసరాలలోకి రాకుండా నియంత్రణ పాటించాలి. కార్బన్ డయాక్సైడ్ లేదా ఫోమ్ ఆధారిత అగ్ని నివారణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పొగను గుర్తించే స్మోక్ డిటెక్షన్ సిస్టమ్ తప్పనిసరిగా ఉండాలి. ఆటోమేటిక్ తాప నియంత్రణ మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. విద్యుత్, యంత్రాలను రోజువారీ, వారానికి, నెలకొకసారి పరిశీలించాలి. పంటను రక్షించేందుకు బయో ఫ్రెండ్లీ పెస్ట్ కంట్రోల్ పద్ధతులు అవలంబించాలి. కలుషిత నీటిని శుద్ధి చేసేందుకు బయోలాజికల్ వేస్ట్ ట్రీట్మెంట్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రికల్, అగ్ని భద్రత, ఆహార భద్రత, వైద్య, ఆడిట్ శాఖల ద్వారా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. వీటితో పాటు ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, వైద్యశాఖ, ఆడిట్, తదితర శాఖలు తరచూ తనిఖీలు నిర్వహించాల్సి ఉంది.

తీరంలో చిరు తాబేళ్ల సందడి

ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లు



తాబేళ్లను సముద్రంలోకి వదులుతున్న సిబ్బంది

నాగాయలంక, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంతంలో ఆలివ్ రిడ్లే చిరు తాబేళ్ల గుడ్ల నుంచి బయటకు వచ్చి, చిరుపాదాలతో సముద్రం వైపు మెల్లగా కదులుతున్నాయి. ఈ అద్భుత దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. సముద్ర పర్యావరణ పరిరక్షణలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆడ తాబేళ్ల గుడ్ల నుంచి పిల్లలు బయలుదేరే ప్రక్రియలో అనేక అవరోధాలుంటాయి. వాటిని రక్షించేందుకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 5 నెలల పాటు సిబ్బంది వాటిని నిరంతరం కాపాడుతూ తాబేళ్ల పిల్లల సముద్ర ప్రయాణాన్ని సురక్షితం చేసేందుకు ఎంతో కృషి చేశారు. అవనిగడ్డ అటవీశాఖ పరిధిలో 50 కిలోమీటర్ల సముద్ర తీరం వ్యాపించి ఉంది. కోడూరు మండలం నుంచి నాగాయలంక మీదుగా బాపట్ల జిల్లా కొత్తపాలెంలోని మూలగుంట వరకు ఈ ప్రాంతం విస్తరించింది. ఇందులో పాలకాయతిప్ప, సంగమేశ్వరం, గుల్లలమోద, జింకపాలెం వంటి ప్రాంతాలను అటవీశాఖ ప్రత్యేక హేచరీలుగా గుర్తించింది. జనవరి నుంచి మే వరకు ఆడ తాబేళ్లు ఒడ్డుకు వచ్చి 60 నుంచి 100 గుడ్లు పెడతాయి. ఒక ఆడ తాబేలు తన జీవితంలో కనీసం రెండుసార్లు గుడ్లు పెట్టే అవకాశం ఉంది. ఆడ తాబేళ్లు స్వయంగా సముద్రం నుంచి బయటికి వచ్చి ఇసుకలో గొయ్యి తవ్వి, గుడ్లను కప్పి తిరిగి సముద్రంలోకి వెళ్లిపోతాయి. అటవీశాఖ సిబ్బంది వీటిని జాగ్రత్తగా సేకరించి హేచరీలో సంరక్షిస్తారు. సుమారు 45-60 రోజుల్లో గుడ్లు పగిలి పిల్లలు బయలుదేరుతాయి. అనంతరం లెక్కింపు తర్వాత, అధికారుల సమక్షంలో సముద్రంలోకి వదిలేస్తారు. ఈ 5 నెలల సంరక్షణ తర్వాత, చిన్న తాబేళ్లు కెరటాలతో కలిసిపోతూ సముద్ర గర్భంలో తేలిపోతున్న దృశ్యం ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తోంది.

కదం తొక్కిన నిరుద్యోగులు

- అవనిగడ్డ డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగుల నిరసన



ఉదయం పోరాటం..

నిరసన ప్రదర్శన చేస్తున్న ఆశావాహులు

అవనిగడ్డ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి శిక్షణ పొందుతున్న డీఎస్సీ ఆశావాహులు మంగళవారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. డీవైఎఫ్ఐ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయం నుంచి రాజీవ్ గాంధీ సర్కిల్ వరకు వందలాది మంది నిరుద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము అధ్యక్షత జరిగిన ఈ ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ తక్షణమే విడుదల చేయకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఆందోళన కూటమి ప్రభుత్వానికి ఒక ట్రైలర్ మాత్రమేనని, ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గత ఏడేళ్లలో ఒక్క డీఎస్సీ ఇవ్వకపోవటంతో నిరుద్యోగులు కోచింగ్ సెంటర్ల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారన్నారు. నిత్యం బ్రాంచ్ గ్రంథాలయంలో పఠనం చేసే నిరుద్యోగులంతా ఉదయం 10 గంటల సమయంలో ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి భారీ ర్యాలీ చేపట్టడంతో పోలీసులు అవాక్కయ్యారు. ముందస్తుగా సమాచారం లేకపోవటంతో వారిని నిలువరించేందుకు పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆందోళన చేసేవారు విద్యార్థులు, నిరుద్యోగులు కావటంతో కొద్దిసేపు శాంతియుతంగా నిరసన తెలిపి వెనుతిరగాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ యువకుమార్ హెచ్చరించటంతో నిరుద్యోగులు కొద్దిసేపు ఆందోళన చేపట్టి వెనుతిరిగారు. డీఎస్సీ అభ్యర్థులు, డీవైఎఫ్ఐ నేతలు పాల్గొనగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అవనిగడ్డ సీఐ యువకుమార్ నేతృత్వంలో ఎస్ఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది రాజీవ్‌గాంధీ సెంటర్‌లో భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సాయంత్రం పాలాభిషేకం

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు, డీఎస్సీ ఆశావాహులు

డీఎస్సీ ఆశావహులతో కూటమినేతల సంబరాలు

అవనిగడ్డ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఏప్రిల్ మొదటి వారంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్టు ప్రకటించటంతో డీఎస్సీ ఆశావాహులతో కలసి కూటమి నేతలు సంబరాలు నిర్వహించారు. స్థానిక రాజీవ్‌గాంధీ సెంటర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు డీఎస్సీ ఆశావాహులతో కలిసి తెలుగుదేశం, జనసేన నేతలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ వేయకుండా నిరుద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డీఎస్సీ ప్రకటన చేశారని, ఇటీవల చెప్పినట్టు ఏప్రిల్ మొదటి వారంలో నోటిఫికేషన్ ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించటం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. టీడీపీ నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, మేడికొండ విజయ్, దాసినేని శ్రీనివాసరావు, బచ్చు రఘునాథ్, కూనపరెడ్డి చంద్రశేఖర్, బండే కనకదుర్గ, ఇమ్మానియేలు, జనసేన నేతలు గుడివాక నరహరికుమార్, బీజేపీ నేత ఏడుకొండలు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన వంశీ కుడిభుజం 'రంగా'

- అరెస్టు చేసిన సీఐడీ

విజయవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు కుడిభుజంగా వ్యవహరించిన ఓలుపల్లి మోహనరంగారావు అలియాస్ రంగ ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. మంగళవారం రాత్రి అతడికి పోలీసులు సంకెళ్లు వేశారు. వంశీ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో మోహనరంగారావు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో ఫిర్యాదిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో ఐదో నిందితుడిగా ఉన్నాడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రెచ్చిపోయిన రంగ, కొమ్మా కోట్లు, యతేంద్ర రామకృష్ణలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అప్పటి వరకు గన్నవరం కేంద్రంగా వ్యవహారాలు చక్కబెట్టిన రంగా అక్కడి నుంచి పరారయ్యాడు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఇది విచారణలో ఉండగానే సత్యవర్ధన్ ఎపిసోడ్‌ను తెర వెనుక ఉండి నడిపించాడు. సత్యవర్ధన్ కిడ్నాప్ వెనుక రంగా, కొమ్మా కోట్లు కీలకపాత్ర పోషించినట్టు పోలీసులు ఇప్పటికే ఆధారాలు సేకరించారు. ఇప్పుడు రంగాను అరెస్టు చేయడంతో ఇక కోట్లు వంతు మిగిలి ఉంది. రాజమహేంద్రవరం వద్ద సీఐడీ పోలీసులు రంగాను పట్టుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. వంశీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అక్రమాలన్నింటిలో రంగా పాత్ర ప్రత్యక్షంగా ఉందని పలు ఫిర్యాదులు అందాయి. వంశీపై తాజాగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసుల్లో రంగా పేర్లు కచ్చితంగా ఉంటోంది. ఈ తరుణంలో రంగా చిక్కడం పెద్ద సంచలనంగా మారింది. అతడిని బుధవారం సీఐడీ కోర్టులో పోలీసులు హాజరుపరిచే అవకాశాలు ఉన్నాయి. సత్యవర్ధన్ కేసులో ఏ5గా ఉన్నందున పటమట పోలీసులు పీటీ వారెంట్‌ను కోర్టులో దాఖలు చేయడానికి సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

వీఎంసీ బంపర్ ఆఫర్

కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పన్ను బకాయిదారులకు నగరపాలక సంస్థ బంపర్ ఆఫర్ ప్రకటించింది. పన్ను బకాయి ఏకమొత్తంలో ఈ నెల 31లోపు చెల్లిస్తే దానిపై ఇప్పటి వరకున్న వడ్డీలో 50శాతం రాయితీ ఇస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం వీఎంసీ పరిధిలోని 13 క్యాష్ కౌంటర్లలో మూడు జోనల్ కార్యాలయాల్లో ఉన్న ఆరు క్యాష్ కౌంటర్లలో ప్రజలకు అందుబాటులో ఉంటాయని, ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

ప్రముఖ పారిశ్రామిక వేత్త

ఆలపాటికి నివాళులు



గవర్నర్‌పేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గోల్డ్‌స్పాట్ సత్యనారాయణ మూర్తి (గోల్డ్‌స్పాట్ మూర్తి) గా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఆలపాటి సత్యనారాయణ మూర్తి (80) పార్థివదేహానికి పలువురు నగర ప్రముఖులు నివాళులర్పించారు. గుండెకు సంబంధించిన వ్యాధికి వైద్య చికిత్సలు తీసుకుంటూ సోమవారం రాత్రి హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో మృతి చెందారు. కుటుంబ సభ్యులు మంగళవారం హైదరాబాద్ నుంచి విజయవాడ సూర్యారావుపేటలోని ఆయన స్వగృహానికి తరలించారు. పలువురు నగర ప్రముఖులు, రాజకీయ నేతలు ఆలపాటి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. గోల్డ్‌స్పాట్ మూర్తికి భార్య, ఇరువురు కుమార్తెలు. ది విజయవాడ బాట్లింగ్ కంపెనీని విజయవాడలో ప్రారంభించి గోల్డ్ స్పాట్, లింకా తదితర శీతల పానీయాలను బిస్లరీ సోడాలను తయారు చేసి జిల్లావ్యాప్తంగా పంపిణీ చేసేవారు. విజయవాడ సిద్ధార్థ అకాడమి పాలకవర్గ సభ్యుడిగా ఉన్నారు. జీవిత కాలంలో అనేక సంస్థలకు, పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాన్ని అందజేశారు. ఆయన అంతిమ సంస్కారాలను పెద్దల్లుడు ప్రకాష్ ఆర్ట్స్ అధినేత సిడిపీ సుబ్బారావు నిర్వహించారు.

అర్ధరాత్రి ఆగని మట్టి దందా

(5వ పేజీ తరువాయి)

బుడమేరుకు ఇరువైపులా ఉన్న నందివాడ మండలం చేదుర్తిపాడు, పెదపారుపూడి మండలం మోపర్రు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రహదారులకు మోక్షం కలిగింది. ఇప్పుడిప్పుడే అభివృద్ధికి నోచుకుంటున్న గ్రామీణ రహదారులు ఈ టిప్పర్ల కారణంగా దెబ్బతింటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరువు

ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలించుకుపోతున్నా డ్రెయినేజీ అధికారుల్లో చలనం లేదు. పగలు మాత్రం తూతూమంత్రంగా చేదుర్తిపాడు వద్ద గస్తీ చేస్తూ, చీకటి పడ్డాక తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. డ్రెయినేజీ చీఫ్ ఇంజినీర్ నుంచి ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్ (ఈవోటీ)కు అనుమతులు రాకుండానే మూడు రోజులుగా మట్టి దోపిడీ కొనసాగుతోంది.

ఇక ఆధునిక ఐజీఎంఎస్

(5వ పేజీ తరువాయి)

ఉంది. క్రికెట్ ప్రాక్టీస్‌కు నెట్, వాలీబాల్, త్రోబాల్, ఫుట్‌బాల్ కోర్టులు ఉన్నాయి. మున్సిపల్ వాటర్ ట్యాంక్ వైపున టెన్నిస్ కోర్టులు ఉన్నాయి. కాగా, 2028-29లో ఈ స్టేడియంలో జాతీయ క్రీడలు నిర్వహించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందుకు వీలుగా స్టేడియాన్ని అభివృద్ధి చేయాలని శాప్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జాతీయ క్రీడల్లో అథ్లెటిక్స్ నిర్వహించడానికి అనువుగా ఇక్కడ ట్రాక్ లేదు. ఈ నేపథ్యంలో రూ.10 కోట్లతో సింథటిక్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. 100, 200, 400 మీటర్ల పరుగులు, హర్డిల్స్ నిర్వహించేలా ఈ ట్రాక్ నిర్మించాలని భావిస్తున్నారు. స్టేడియానికి బయట ఉన్న ఫుట్‌బాల్ కోర్టు వద్ద 200 మీటర్ల సింథటిక్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. ఇటీవల ఈ స్టేడియంలో ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలు నిర్వహించినప్పుడు అథ్లెటిక్స్ కోసం తాత్కాలికంగా ఎర్రమట్టితో ట్రాక్‌లను ఏర్పాటు చేశారు.

ఆరని మిర్చి మంటలు

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. సుమారు 80 వేల టిక్కీల మిర్చిని భద్రపరిచేలా ఈ అరలు నిర్మించారు. ప్రమాదం జరిగే సమయానికి ఇందులో 13,960 టిక్కీల మిర్చి ఉన్నట్టు అధికారులు లెక్కించారు. ఈ సరుకంతా 385 మంది రైతులకు సంబంధించినదిగా గుర్తించారు.

ఇటీవలే రుణం తీసుకున్న యజమాని

కోల్డ్ స్టోరేజీ నిర్వాహకుడు, యజమాని రావూరి శ్రీనివాసరావు.. లోపల ఉన్న మిర్చిపంటను హామీగా పెట్టి బ్యాంకు నుంచి రుణం తీసుకున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్ధారించారు. సుమారు రూ.6.36 కోట్ల వరకు కొద్దిరోజుల క్రితమే బ్యాంకు నుంచి రుణం తీసుకున్నట్టు పేర్కొన్నారు. అసలు లెక్కలు తేల్చడం కోసం కోల్డ్ స్టోరేజీ వద్ద ఉన్న రికార్డులను మార్కెటింగ్ శాఖ అధికారులు సీజ్ చేశారు. ఇలా బ్యాంకు నుంచి తీసుకున్న రుణం డబ్బును రైతులకు పంచాల్సి ఉంది. ఇంతలోనే అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదాలను నియంత్రించడానికి ఉండాల్సిన భద్రతా చర్యలు కూడా ఇక్కడ లేవని తెలుస్తోంది. కోల్డ్ స్టోరేజీకి సంబంధించిన బీమా గడువు నెల క్రితం ముగిసినట్టు తెలిసింది. ఇదే కనుక జరిగితే బీమాను క్లెయిమ్ చేసుకోవడం సాధ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రుణం మొత్తంలో నుంచి బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించాలని నిర్వాహకుడు శ్రీనివాసరావు నిర్ణయించినట్టు తెలిసింది. ఇంతలో ఈ దారుణం జరిగింది.

స్థూల ఉత్పాదకతలో సంవృద్ధి

(5వ పేజీ తరువాయి)

ఉత్పాదకతను సాధించడం విశేషం. పారిశ్రామిక రంగానికి సంబంధించి మైనింగ్-క్వారీయింగ్‌లో రూ.1,149 కోట్లు, తయారీకి సంబంధించి రూ.3,310 కోట్లు, ఎలక్ట్రిసిటీ, గ్యాస్, వాటర్ సప్లైకు సంబంధించి రూ.2,638 కోట్లు, నిర్మాణాలకు సంబంధించి రూ.10,632 కోట్ల ఉత్పాదకతతో గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోల్చుకుంటే రూ.3,293 కోట్ల మేర అదనంగా ఉత్పాదకతను సాధించింది. సేవా రంగంలో ట్రేడ్, హోటళ్లు, రెస్టారెంట్ల ద్వారా రూ.16,691 కోట్లు, రైల్వేస్ ద్వారా రూ.1,250 కోట్లు, రవాణా ద్వారా రూ.6,088 కోట్లు, కమ్యూనికేషన్స్ ద్వారా రూ.2,691 కోట్లు, బ్యాంకింగ్-ఇన్‌స్టిట్యూట్స్ ద్వారా రూ.10,005 కోట్లు, రియల్ ఎస్టేట్ ద్వారా రూ.10,046 కోట్లు, ఇతర సేవల ద్వారా రూ.8,842 కోట్ల ఉత్పాదకత సాధించింది. గత రెండు ఆర్థిక సంవత్సరాలతో పోల్చుకుంటే 18.06 శాతం వృద్ధితో రూ.10,591 కోట్ల ఉత్పాదకతను ఎన్టీఆర్ జిల్లా సాధించడం విశేషం.

రెండు జిల్లాల కాంట్రిబ్యూషన్

రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పాదకతలో రెండు జిల్లాలు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. గత రెండేళ్లతో పోల్చి చూస్తే ప్రస్తుతం ముగియనున్న, రాబోయే ఆర్థిక సంవత్సరాల్లో సాధించాల్సిన కాంట్రిబ్యూషన్ రెండంకెల వృద్ధిలో ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా 5.79 శాతం, కృష్ణాజిల్లా 5.57 శాతం కాంట్రిబ్యూషన్‌ను నమోదు చేశాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా 6.04 శాతం, కృష్ణాజిల్లా 5.53 శాతం కాంట్రిబ్యూషన్‌ను నమోదు చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం (ఇంకా ముగియలేదు)లో ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా 5.94 శాతం, కృష్ణాజిల్లా 5.51 శాతంలో ఉన్నాయి. రాబోయే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎన్టీఆర్ జిల్లా 6.01 శాతం, కృష్ణాజిల్లా 5.50 శాతం మేర రాష్ట్ర జీడీపీకి కాంట్రిబ్యూషన్ ఇచ్చేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి.

అవినీతికి సహకారం

(5వ పేజీ తరువాయి)

రూపాయలకు పైగా నగదును పక్కదారి పట్టించాడని రైతులు ఆరోపిస్తున్నారు.

బయటపడింది ఇలా..

గోకవరం పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాలు చెల్లించేశారు. తిరిగి రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, గతంలో తీసుకున్న రుణాలు చెల్లించారా, లేదా అనే విషయంపై బ్యాంకు అధికారులు స్టేట్‌మెంట్లను తీశారు. రైతులు రుణాలు చెల్లించనట్టుగా చూపడంతో ఇదే విషయాన్ని బ్యాంకు అధికారులు రైతులకు తెలియజేశారు. అవాక్కయిన రైతులు రుణాలు చెల్లించిన సమయంలో తమకు ఇచ్చిన రసీదులను చూపారు. దీంతో బ్యాంకు అధికారులు పదిమందికి పైగా రైతులకు సంబంధించిన వివరాలను సేకరించే పనిని ప్రారంభించారు. దీంతో పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూశాయి. పీఏసీఎస్ అధ్యక్షుడు, సీఈవో తమను నిలువునా మోసం చేసిన విషయం తెలుసుకున్న రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై 51 విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. పీఏసీఎస్ సీఈవోకు, అధ్యక్షుడికి వివిధ రకాల వ్యాపారాలు ఉన్నాయని, రైతుల నుంచి రుణాల చెల్లింపుల రూపంలో వసూలు చేసిన నగదును తమ వ్యాపారాల్లో పెట్టుబడులుగా పెట్టి ఉంటారని ఆరోపిస్తున్నారు. పీఏసీఎస్‌లో నగదు దారి మళ్లిన విషయం బయటపడటంతో సంబంధిత సీఈవో అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చేరాడు. వైసీపీకి చెందిన వ్యక్తి ఈ పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా, కేడీసీసీబీ పాలకవర్గం డైరెక్టర్‌గా ఐదేళ్లు పనిచేశాడు. కేడీసీసీబీ ద్వారా రుణాల మంజూరులో కమీషన్‌ను తీసుకోవడంతో పాటు తాను ప్రాతినిధ్యం వహించిన గోకవరం పీఏసీఎస్‌లో అక్రమాలకు పాల్పడటంలో ఈ వైసీపీ నాయకుడు తనదైన శైలిలో వ్యవహరించేవాడనే ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డుప్రమాదంలో లారీడ్రైవర్‌కు తీవ్రగాయాలు



బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

పామర్రు, మార్చి25 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కొండాయపాలెం వద్ద పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో లారీడ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పామర్రువైపు నుంచి గుడివాడ వెళ్తున్న లారీ కొండాయపాలెం వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొంది. దీంతో గుడివాడ వైపువెళ్తున్న లారీడ్రైవర్ గుంజశ్రీనివాసరావు(50) క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, పోలీసుల సహాయంతో లారీలో ఇరుక్కుపోయి గాయలైన శ్రీనివాసరావును బయటకు తీశారు. అనంతరం బాధితుడిని చికిత్సనిమిత్తం 108లో బందరు ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు ఎస్సై రాజేంద్రప్రసాద్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్సై విశ్వనాథం

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి

కూచిపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కూచిపూడి ఎస్సై కె.నాగ విశ్వనాథం పేర్కొన్నారు. మొవ్వ వీఎస్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు భారత రాజ్యాంగంపై నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్సై విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. క్రమశిక్షణతో, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఆయన సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి, సర్టిఫికెట్ కోర్సు కన్వీనర్ డా.ఎం.సుందరరావు, వైస్ ప్రిన్సిపల్ కె.ఆర్.మంజుల, అధ్యాపకులు పాల్గొన్నారు.

లోకాస్ యాప్‌పై శిక్షణ

పమిడిముక్కల : మండల పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల వీవోఏలకు మంగళవారం లోకాస్ యాప్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల వ్యక్తిగత వివరాలు, బ్యాంక్‌లోన్ వివరాలు, డేటా నమోదు చేయడంపై వెలుగు ఏపీఎం డి.వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. ఎల్‌సీ బిక్షమయ్య, ఎంఎస్ సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

పసరు నీరు తాగేదెలా..!

● కలుషిత నీటితో రోగాల భారిన పడుతున్న ప్రజలు ● మరమ్మతులకు నోచుకోని ఫిల్టర్ బెడ్‌లు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - పెదపారుపూడి) : మోపర్రులో గ్రామస్థులకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో మంచినీటి చెరువు ఉన్నప్పటికీ ఫిల్టర్ బెడ్‌లు పని చేయటం లేదు. దీంతో పంచాయతీ సిబ్బంది చెరువు నీటిని ఫిల్టర్ చేయకుండానే కుళాయిలకు వదులుతున్నారు. కుళాయిల్లో వచ్చే కలుషితమైన నీరు పసరు రంగులో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. ఈ నీరు కనీసం పశువులు తాగేందుకు సైతం ఉపయోగపడటం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా అయినా పాడైపోయిన ఫిల్టర్ బెడ్ సరి చేసి నీటిని అందించాలని గ్రామస్థుల కోరుతున్నారు.



మోపర్రు గ్రామంలోని మంచినీటి చెరువు



పాడైపోయిన ఫిల్టర్ బెడ్

వేసవికాలం ప్రారంభం కావటంతో చెరువులో నీరు క్రమేనా అడుగంటుతుంది. వాటర్ ఫిల్టర్ పాడైపోవటంతో చెరువులో నీరు ఆకుపచ్చ రంగులో వస్తుంది. ఈ నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తుందని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. తక్షణమే అధికారులు స్పందించి వాటర్ ఫిల్టర్‌ను బాగు చేసి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు చేయాలి



వైసీపీహయాంలో మంచినీటి సమస్య గురించి ప్రజాప్రతినిధులకు వివరించాం. వారు సమస్యను పరిష్కరించేందుకు అంచనాలు వేయిస్తున్నామని కాలం దాటేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులు చేయించి, తాగునీటిని అందించాలి.

జూపల్లి రాజేష్, గ్రామస్థుడు

వారం రోజుల్లో మరమ్మతులు చేస్తాం



మోపర్రు గ్రామంలో ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు రూ.3,85,000ల నిధులు మంజూరు చేశాం. వారం రోజుల్లోగా మరమ్మతు పనులు పూర్తి చేస్తాం.

సీతామహాలక్ష్మి, ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ ఇంజనీర్ గోవిందరావు

ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు డిజైనింగ్‌పై వర్క్‌షాపు

గుడివాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో రెండ్రోజులుగా కళాశాల ఐఈటీఈ చాప్టర్, విజయవాడకు చెందిన మైక్రో లింక్ పెరిఫరల్ కంట్రోల్స్ ప్రై లిమిటెడ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు డిజైన్ అండ్ ఇట్స్ డెవలప్‌మెంట్‌పై బీటెక్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులకు రెండ్రోజుల జాతీయ స్థాయి కార్యశాల నిర్వహించారు. మైక్రో లింక్ పెరిఫరల్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ ఇంజనీర్ వి.గోవిందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కల్యాణ్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి ప్రసాదరావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి యమ్.నాగు, ఆన్‌చార్జ్ విభాగాధిపతి గొరిపర్తి మురళీకృష్ణ, ఐఈటీఈ చాప్టర్ సమన్వయకర్త గుత్తా రాజేంద్ర, సీనియర్ ఫ్యాకల్టీ యమ్.దేవకి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌వోబీ నిర్మాణ పనులకు అనుమతులు మంజూరు

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : గుడివాడలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, రైల్వే గేట్ల వద్ద నిర్మాణ పనులకు సాంకేతిక అనుమతులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. స్థానిక రాజేంద్ర నగర్‌లోని ఆయన తన స్వగృహంలో జాతీ య రహదారుల అథారిటీ అధికారులతో రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనులపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రహదారుల అభివృద్ధి పనులపై ఆరా తీశారు. రైల్వేశాఖ అనుమతులతో ఆర్‌వోబీ నిర్మాణం వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ప్రధానంగా రైల్వే గేట్ల వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభవుతున్న నేపథ్యంలో ఎక్కువ రోజులు గేట్లను మూసివేయాల్సి ఉంటుందన్నారు. అండర్ పాస్ నిర్మాణ పనులనూ త్వరితగతిన ప్రారంభించేలా కృషి చేస్తామన్నారు. బస్టాండ్ సెంటర్ నుంచి వాసవిచౌక్, మార్కెట్ సెంటర్, బంటుమిల్లి రోడ్డు మీదగా బైపాస్‌రోడ్డువరకు రహదారికి ఇరువైపుల ఫుట్‌పాత్‌లపై టైల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో రహదారులు వెంబడి డ్రెయినేజీల అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులూ త్వరలోనే ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సంజీవనాయుడు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శరత్‌చంద్ర, ప్రాజెక్టు మేనేజర్ ఎన్.శ్రీనివాస్, టీం లీడర్ దివాకర్, రెసిడెంట్ ఇంజనీర్ బి.నిరంజన్‌రావు, వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ ఎం.డి వి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఎన్.హెచ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ఉపాధిహామీలో ఎఫ్ఏల అక్రమాలు బహిర్గతం

● డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్ శివప్రసాద్

తోట్లవల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కింద 2023-24లో రూ. 5,27,60,000లతో చేసిన 1,008 పనులకు సంబంధించి తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజా వేదిక గ్రామసభ నిర్వహించారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్ శివప్రసాద్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని సదరు పనులపై సమీక్ష చేశారు. 16 గ్రామాల్లో సామాజిక తనిఖీ సిబ్బంది పర్యటించి రూపొందించిన సర్వే రిపోర్టులను బహిర్గతం చేశారు. ఈ గ్రామసభలో ఎఫ్ఏలు అక్రమంగా కూలీలకు మస్తర్లు వేసి, డబ్బులు ఇచ్చి అక్రమాలకు పాల్పడినట్టుగా గ్రామస్థాయి సామాజిక తనిఖీసిబ్బంది పరిశీలనలో తేలింది. ఎఫ్ఏలు కూలీలను గ్రామస్థాయి గ్రామసభకు తీసుకొచ్చి అనుకూలంగా చెప్పించినట్టు తేలింది. మొక్కల సంరక్షణపై లెక్కలు తప్పుగా చూపినట్టు బయటపడింది. చివరికి రూ. 37,000 రికవరికి ఆదేశాలిస్తు గ్రామసభను ముగించారు. గరికపర్రులో ఎఫ్ఏలు అక్రమాలకు పాల్పడితే అతనిచేత ఉద్యోగానికి రాజీనామా చేయించి తప్పులను క్షమించేశారు. దీంతో ఆ ఎఫ్ఏ గ్రామసభకు రాకుండా తప్పించుకున్నట్టయింది. పనిలేని రోజుల్లో కూలీలకు పని కల్పించి ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకం సిబ్బంది అక్రమాలతో జేబులు నింపుకోవటం పరిపాటిగా మారింది. ఈ గ్రామసభలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, ఎంపీడీవో రవికాంత్, ఏపీడీ కె.లక్ష్మీరెడ్డి, డీవీవో ఎన్ సురేష్, పి. రామ్మోహన్, జయప్రసాద్, వైస్ ఎంపీపీ కె. సాంబశివరెడ్డి, మూడు గ్రామాల సర్పంచ్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్



బాపనయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

గుంటూరు బాపనయ్యకు నివాళి

గుడివాడ : స్థానిక సుందరయ్యభవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు బాపనయ్య 47వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు వేశపోగు యేషయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, రేపాని కొండ, లంకా సురేంద్ర, సింగవరపు రాంబాబు, సంగుర్తి శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, వై.వి సుబ్బారావు, వి.కృష్ణకిషోర్, జి.గోపాల్, ఎ.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యం

● ముడా చైర్మన్ మట్టా ప్రసాద్

గుడివాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్‌జీవోస్ హోంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసిందన్నారు. పరిశ్రమలు నిర్వహించే వారికి వివిధ రుణసదుపాయాలను సబ్సిడీల ద్వారా లబ్ధి పొందేందుకు ఉద్యం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలందరూ వారి యూనిట్స్‌కు సంబంధించిన సర్టిఫికెట్లను పొందాలని సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, ఇండస్ట్రీయల్ ప్రమోషన్ అధికారి మనోజ్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, ఇండస్ట్రీయల్ వర్కర్స్ యూనియన్ గుడివాడ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్, బీజేపీ నాయకులు దొండపాటి శివాజీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముడా చైర్మన్ ప్రసాద్

మండల సమావేశం ఏప్రిల్ 3న

పెదపారుపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్ 3వతేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో సీతామహాలక్ష్మి ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.



సమస్యలను తెలుసుకుంటున్న శ్రీకాంత్

తాగునీటి వసతి కల్పిస్తాం

● జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్

గుడివాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : పిన్నమనేని నగర్, నక్కలకాలువ వాసులకు మంచినీటి, రహదారుల సమస్యలను పరిష్కారిస్తామని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ హామీఇచ్చారు. మంగళవారం ఆయా ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని బూరగడ్డ పేర్కొన్నారు.



అనూషకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఆటోనగర్ విస్తరణకు భూమి కేటాయించాలని వినతి

గుడివాడ: ఆటోనగర్ విస్తరణకు 30 ఎకరాల భూమి కేటాయించాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తమ్మిశెట్టి లక్ష్మణరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక 20వ వార్డు సచివాలయంలో వార్డు అడ్మిన్ అనూషకు ఆటోనగర్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్‌లో తాగునీరు ఏర్పాటుచేయాలని కోరారు. సులభ కాంప్లెక్స్ నిర్మించాలన్నారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఆటోనగర్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రిజర్వు స్థలంలో యూనియన్ సమావేశాలకు 5సెంట్ల భూమిని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సభ్యులు అబ్దుల్ ఖుద్దూస్, ఎస్.కె మొహిద్దీన్, రెడ్డి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్‌వైర్ల చోరీలపై కేసుల నమోదు



కత్తిరించుకుపోయిన కేబుల్ వైర్లు

తోట్లవల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలంలో పలు గ్రామాల్లోనూ, లంకల్లోనూ సబ్‌మెర్సిబుల్ మోటార్ల వద్ద కేబుల్ వైర్లు చోరీలపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై సీహెచ్ అవినాష్ మంగళవారం తెలిపారు. 190 మోటార్ల వద్ద 950 మీటర్ల కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయని తేలిందని ఎస్సై తెలిపారు. కాగా రాత్రి సమయాల్లో పంట పొలాల వద్ద మోటార్ల కేబుల్ వైర్లు కత్తిరించుకుపోతున్నఘటనలు రైతుల్లో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. అయితే నిన్నటి వరకు ఈ అంశాన్ని పోలీసులు తేలిగ్గా తీసుకున్నారు. రైతులు తెలిపినా ఏమి చేయలేమనే సమాధానం ఇస్తూ వచ్చారు. ఇపుడు హఠాత్తుగా నాలుగు కేసులు నమోదు చేయటం చర్చనీయాంశంగా మారింది. నాలుగు రోజుల క్రితం కంకిపాడులో కేబుల్ వైర్ల దొంగలు పట్టుబడినట్టు తెలిసింది. దీంతో వారిపై తాజాగా నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్టు తెలుస్తోంది. దొంగలు ఎవ్వరనేది త్వరలో బహిర్గతం చేస్తామన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

గుడివాడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను పాత బకాయిలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సర బకాయిలను ఈ నెల 31వ తేదీ లోపు చెల్లిస్తే 50శాతం రాయితీ పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పన్నులను వెంటనే చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

పంట వివరాల నమోదు తప్పనిసరి

గుడివాడ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మినుము పండించిన రైతులు తమ పంట వివరాలను ఆర్ఎస్‌కేలలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ మండల విస్తరణాధికారిణి వి.అనిత పేర్కొన్నారు. మల్లాయిపాలెం ఆర్ఎస్‌కేలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ గుడివాడ మార్కెట్ యార్డులో మినుము కొనుగోలు కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. మినుములు క్వింటా రూ.7400లకు కొనుగోలు చేస్తామని తెలిపారు. పంటను తక్కువకు దళారుల వద్ద అమ్మవద్దని, నాణ్యమైన ధర వస్తుందని ఆమె రైతులకు సూచించారు. రైతులు తొందరపడి తక్కువ ధరకే దళారులకు తమ పంటను అమ్ముకోవద్దని తెలిపారు. రూ.7400ల కంటే ఎక్కువ వస్తే బయట అమ్మవచ్చునని ఆమె రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాయిపాలెం రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.అనిత

బకాయిల విడుదలపై ఎస్టీయూ హర్షం

గుడివాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లగా ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో పీఎఫ్ బకాయిలు, ఏపీజీఎల్ఐ లోన్లు, మెచ్యూరిటీ క్లయిమ్‌లు, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన చందాలను విడుదల చేయడంపై ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇమ్మానియేల్, డి.చంద్రశేఖర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2022 నుంచి ఉద్యోగులకు సంపాదిత సెలవులకు సంబంధించి నగదు చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్నెళ్ల నుంచి రిటైరైన ఉపాధ్యాయులకు గ్రాట్యూటీ చెల్లింపులు జరగడం లేదన్నారు. రెండు, మూడు సంవత్సరాల నుంచి పదవీ విరమణ అనంతరం సంపాదిత సెలవులకు నగదు చెల్లింపులను క్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మనమిత్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కూచిపూడి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎండీవో జె.విమాదేవి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి మొవ్వ ఎండీవో కార్యాలయంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలకు సంబంధించి క్యూఆర్ కోడ్‌ను నోటీసు బోర్డులో ప్రదర్శించారు. ప్రజలకు అవసరమైన వివిధ రకాల సేవలను ఈ వాట్సాప్ ద్వారా పొందవచ్చునని ఆమె తెలిపారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని గృహ యజమానులు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు సంబంధిత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎండీవో కోరారు.

గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకుఅవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజేంద్రప్రసాద్

పామర్రు, మార్చి25 (ఆంధ్రజ్యోతి): దొంగతనాల పట్ల గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామర్రు ఎస్సై రాజేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని జుజ్జువరంలో మత్తుపదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి, అంటరానితనం, బాల్యవివాహాల వల్ల కలిగే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్తవ్యక్తులు కనిపించిన, ఎవరిపైనైనా అనుమానం కలిగినా వారిపట్ల పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికాకుండా జాగ్రత్త పడాలన్నారు. గ్రామాల్లో ప్రధాన వీధుల్లో ప్రజలు సమష్టిగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకుని పోలీసులకు సహకరించాలన్నారు. ఏఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 405

జిల్లా కర్రసాము అసోసియేషన్ అధ్యక్షుడిగా సింహాద్రి పవన్



అవనిగడ్డ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కర్రసాము అసోసియేషన్ అధ్యక్షుడిగా నియోజకవర్గ యువనేత సింహాద్రి పవన్ ఎన్నికయ్యారు. జిల్లాలోని యువతకు, విద్యార్థులకు గ్రామీణ క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందింపజేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ సూచనల మేరకు ఈ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయగా, అసోసియేషన్‌లో అధ్యక్షునిగా సింహాద్రి పవన్, ఉపాధ్యక్షునిగా డ్యాన్స్ అండ్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ ఈశ్వర్, కార్యదర్శిగా విశ్వ, సహాధ్యక్షునిగా కురాళ్ల వెంకట సుబ్బారావు, మరో ముగ్గురితో అసోసియేషన్ పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

జామియా మసీదు కమిటీ ఇఫ్తార్ విందు

పెడన, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అన్ని మతాల వారు సోదరబావంతో మెలగాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. జామియా మసీద కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలకు మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కృష్ణప్రసాద్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, రంజాన్ మాసంలో నిష్టతో చేసే ఉపవాస దీక్షలు క్రమశిక్షణాయుతమైన జీవితానికి బాటలు వేస్తాయన్నారు. అల్లాహ్ బోధనలు ప్రేమతత్వాన్ని, త్యాగాన్ని, సోదర బావాన్ని పెంపొందించాయన్నారు. కృష్ణప్రసాద్, వేణుగోపాలరావులను మసీ దు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖదీర్, వహబ్‌ఖాన్, అబ్దుల్ ఖయూం, హమీదుల్లా, మెహమూద్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం



అవనిగడ్డ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డలో అ లివేలు మంగ, రాజ్యలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం అర్చకులు ధన్వంతారాచార్యుల నేతృత్వంలో అర్చకులు అగ్నిహోత్రం విఖనస ఆధ్వర్యంలో మండలి దుర్గానాథ్ దంపతులు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మండలి భావన్నారాయణ ఆధ్వర్యంలో మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

పుల్లపాడు సర్పంచ్ నాగేశ్వరమ్మ మృతి



పెడన, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పెడన మండలం పుల్లపాడు సర్పంచ్ జోగి నాగేశ్వరమ్మ (75) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. నాగేశ్వరమ్మ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుమారుడు, మాజీ సర్పంచ్ జోగి సుబ్రహ్మణ్యాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి



వ్యవసాయ కళాశాల విద్యార్థుల స్టాల్స్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్

మోపిదేవి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రకృతి సాగు పంటలపై రైతులు దృష్టిసారించాల్సిందిగా ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ కోరారు. వెంకటాపురంలో మంగళవారం ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కిసాన్ మేళా నిర్వహించారు. కిసాన్ మేళాలో వేసవి కాలంలో వివిధ పంటల పరిరక్షణ, సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. మండలి బుద్దప్రసాద్ మాట్లాడుతూ రైతులు క్రిమి సంహారక మందులు తగ్గించుకుని భూసారాన్ని పెంచుకునే విధా నం అవలంభించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఉత్పత్తులకు, చిరు ధాన్యాలకు మార్కెట్‌లో క్రమేపీ డిమాండ్ పెరుగుతుందన్నారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగిన కారణంగా ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెరగటానికి ముఖ్య కారణమన్నారు. నియోజకవర్గంలో రూ.12 కోట్లతో వ్యవసాయ రంగానికి అవసరమైన అభివృద్ధి పనులు ప్రారంభించటం జరిగిందన్నారు. వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ప్రకృతి వ్యవసాయ విభాగంల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను శాస్త్రవేత్తలతో కలసి బుద్దప్రసాద్ పరిశీలించి వారిని ప్రత్యేకంగా అభిన ందించారు. కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మా సోములమ్మ, ఎంపీపీ రావి దుర్గావాణి, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్ధనరావు, తుమ్మల చౌదరిబాబు, అవనిగడ్డ ఏడీఏ జయప్రద, డీఆర్సీ ఏడీ కె.శ్రీనివాసరావు, ఏవో కె.హెబ్సిబా రాణి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రేవతి, మంజువాణి, వెంకటలక్ష్మి, నవీన్, కృష్ణవేణి, ఉద్యాన శాఖాధికారి రమేష్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యసేవలు అందించాలి

అవనిగడ్డ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే మండలి బుద్ద ప్రసాద్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే మండలి మాట్లాడుతూ రోగులకు ఉత్తమ సేవలు అందించాలని, సదరం శిబిరం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఇన్ పేషంట్లకు అందించే ఆహారంపై ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు కొల్లూరి వెంకటేశ్వర రావు, తుంగల వెంకటగిరి, బచ్చు కృష్ణకుమారి మాట్లాడుతూ ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న డాక్టర్ గురించి స్పష్టత ఇచ్చేందుకు ల్యాండ్‌లైన్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. దాతలు ఇచ్చిన సిలెండర్లు, కాన్సన్ట్రేటర్లు లెక్క తేల్చాలని, అవసరమైతే దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. ఎంపీడీవో మరియాదేవి, పంచాయతీ కార్యదర్శి అనిత, ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మినుములు, పెసల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఘంటసాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మినుములు, పెసల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.మురళీకృష్ణ తెలిపారు. కొడాలి రైతు సేవా కేంద్రంలో మినుము కొనుగోలు కేంద్రాన్ని, మొవ్వ రైతు సేవా కేంద్రంలో పెసలు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మంగళవారం తెలిపారు. మినుము ధర రూ.7400, పెసలు ధర రూ.8682గా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన తెలిపారు.

గాయపడిన నాగ బాజీబాబు మృతి

అవనిగడ్డ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగాయలంకకు చెందిన కిరాణా వర్తకుడు నాగ బాజీబాబు (40) విజయవాడలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. నాగబాజీబాబుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాగ బాజీబాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం పట్ల నాగాయలంక మండల కిరాణా వర్తక సంఘం సంతాపం తెలియజేసింది.

మహిళల రక్షణకు అందరూ భాగస్వాములు కావాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్పీ వి.వి.నాయుడు

మచిలీపట్నం టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ తనను తాను రక్షించుకునేందు ఆయుధంగా మారాలని ఏఎస్పీ వి.వి. నాయుడు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో మంగళవారం మహిళల రక్షణ - నేరాల నియంత్రణ అంశంపై అవగాహన సదస్సు జరిగింది.

మహిళల రక్షణకు, వారిపై వేధింపులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం వహించా లన్నారు. చిన్నతనం నుంచే బాలికలను సరైన రీతిలో ధైర్యసాహసాలతో పెంచేందుకు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. మహిళల, యువతుల వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఏర్పడతాయన్నారు.

మహిళ లకు ఏదైనా సహాయం అవసర మైతే 121, 1098కి ఫోన్ చేస్తే తక్షణం రక్షణ పొంద వచ్చన్నా రు. మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వాసా వెంకటేశ్వర రావు, సీడ బ్యాసీ చైర్‌పర్సన్ కె. సువార్త, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రాణి, సీడీపీవో మౌనిష, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అర్పిష్మా, అంగన్వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతి నిధులు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీల లెక్కింపు నేడు

మోపిదేవి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 8 గంటలకు దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగే హుండీల ఆదాయం లెక్కింపునకు డ్రెస్‌కోడ్ నిబంధనలతో పాల్గొనవచ్చునని తెలిపారు. హుండీల లెక్కింపు సందర్భంగా స్వామివారి నిత్య శాంతి కల్యాణం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

అవనిగడ్డ మండల సమావేశం రేపు

అవనిగడ్డ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మరియ కుమారి మంగళవారం తెలిపారు. ఎంపీపీ తుంగల సుమతి దేవి అధ్యక్ష తన జరిగే సమావేశంలో మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

గంగానమ్మ గ్రామోత్సవం ప్రారంభం రేపు

కోడూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కోడూరులో భక్తుల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న గంగానమ్మ అమ్మవారి గ్రామోత్సవం గురువారం ప్రారంభిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధర్‌రావు తెలిపారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక వాహనంపై ఉంచి 27 నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజులపాటు కోడూరు, స్వతంత్రపురం, దింటిమెరక, వేటపాలెం, నరసింహాపురం, ఇస్మాయిల్ బేగ్ పేట, యర్రారెడ్డి పాలెం గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. 31న ఆలయ ప్రధాన జాతర నిర్వహిస్తున్నట్లు యుగంధర్ తెలిపారు.



కంకటావలో చేతిపంపు ఏర్పాటు

గూడూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం కంకటావ గ్రామ పం చాయతీలో మంగళవారం క్రైస్ట్ ఫెలోషిప్ మినిస్ట్రీస్ కోనప్పపేట వారిచే గ్రామ మం డల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బోరు, చేతిపంపును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రెవరెండ్ డాక్టర్ ఎం. జోసఫ్, గ్రామ సర్పంచ్ మద్దాల వీరవెంకట మోహనరావు, గ్రామ ఉపసర్పంచ్ బూరగడ్డ బాబి, సచివాలయ సెక్రటరీ పి. సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.నవీన్ బాబు, పాస్టర్, ఎస్ఎంసీ చైర్మన్ గల్లా దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపు ఎలా పెట్టారు!



ఎక్సైజ్ శాఖపై సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయరాధిక

చల్లపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఇబ్బంది కలిగించే విధంగా సాగర్ థియేటర్ సమీపాన ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు ఎలా అనుమతి ఇచ్చారని ఎంపీపీ కోట విజయరాధిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చల్లపల్లి మండల పరిషత్ సమావేశం మంగళవారం ఎంపీపీ విజయరాధిక అధ్యక్షతన జరిగింది. ఎక్సైజ్ శాఖ సమీక్షలో హెచ్‌సీ సుబ్బారావు మాట్లాడుతుండగా, ఎంపీపీ జోక్యం చేసుకుని మద్యం దుకాణాల అనుమతుల్లో నిబంధనలు, ప్రజల విజ్ఞప్తులు పట్టించుకోరా అన్నారు. ఆ బజారులో మహిళలు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందనీ, రోజూ తానే ఆ రోడ్డులో వెళ్తున్నాని, భద్రత ఎలా ఉంటుందని అన్నారు. తహసీల్దార్ అనుమతి తర్వాతే తాము అనుమతి ఇచ్చామనీ, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు మాట్లాడుతూ బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయన్నారు. తమ గ్రామంలో మందుబాబులు అర్ధరాత్రి వేళల్లో ఫోన్ చేసి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని వాపోయారు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల పరిషత్ సమావేశానికి అన్నిశాఖల అధికారులు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీపీ విజయరాధిక స్పష్టం చేశారు. శాఖల సమీక్షలో పలువురు అధికారులు గైర్హాజరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో గైర్హాజరైన అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు. అధికారిక సమావేశాలు ఉంటే కనీసం సమాచారం ఇవ్వాలన్నారు. రాజీవ్‌గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతుల విషయమై దుకాణదారులను ఇప్పటికిప్పుడు ఖాళీ చేయించటం కాకుండా వారికి కొంత సమయం ఇవ్వాలనీ, వారితో సమావేశమై నిర్ణయం తీసుకోవాలని లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు మోపిదేవి ద్వారకానాథ్ సూచించారు. మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు మాట్లాడుతూ, మంగలివానిసింకు డ్రెయినేజీ కారణంగా ఉప్పునీరు వస్తోందని, చెరువుగట్టు ఆక్రమణల విషయంలో అధికారులు స్పందించటం లేదనీ, ఉపాధిహామీ పథకంలో చెరువు తవ్వకం తదితర సమస్యలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు జి.సాయిసింధు, పి.వెంకటేశ్వర రావు, డాక్టర్ పి.మనోజ్‌కుమార్, డాక్టర్ పద్మావతి, బొప్పన శ్రీనివాసరావు, భోగాది జగత్, రవిశంకర్, శ్రీలత తదితరులు ఆయా శాఖల సమీక్షలో మాట్లాడారు. వైస్ఎంపీపీ పిట్టి వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కాలువ గట్ల మీద చెట్లు నరికేస్తున్నారు!



నాగాయలంక, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక నుంచి గుల్లలమోద వరకు సౌత్‌చానల్ కాల్వ గట్లపై ఉన్న భారీ చెట్ల కొమ్మలను నరికి వేస్తున్నారని వృక్ష ప్రేమికులు గగ్గోలు పెడుతున్నారు. ఒక పక్క కాలుష్య నివారణకు ప్రభుత్వాలు మొక్కలను పంపిణీ చేసి పెంచాలంటూ చర్యలు తీసుకుంటుండగా, మరోపక్క అవసరం లేకుండా చెట్ల కొమ్మల్ని నరికి వేస్తున్నారన్నారు. ఇప్పటికైనా నీటి సంఘం అధ్యక్షులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నీటి ప్రవాహానికి అడ్డు వచ్చే చిన్నపాటి కొమ్మలను తొలగించి వృక్షాలను పరిరక్షించాలని వృక్ష ప్రేమికులు కోరుతున్నారు. ఇరిగేషన్ ఏఈ పి.రవితేజను వివరణ కోరగా, కాలువలోకి బాగా వాలిపోయిన చెట్ల కొమ్మలను మాత్రమే నరుకుతున్నట్లు తెలిపారు.



కె.మన్‌హాస్ హిమవర్షిణి ఎం. గీతార్థ్

నవోదయకు ముగ్గురు ఎంపిక

అవనిగడ్డ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నవోదయ ఎంట్రెన్స్ పరీక్షల్లో దివి ప్రాంతానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపి 6వ తరగతలో ప్రవేశాలకు ఎంపికయ్యారు.

అవనిగడ్డకు చెందిన కూనపరెడ్డి మన్‌హాస్, నాగాయలంక మండలం ఏటిమొగ గ్రామానికి చెందిన హిమవర్షిణి నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు ఏటిమొగ ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు ఓం సుబ్రహ్మణ్యం తెలిపారు.


వక్కలగడ్డ విద్యార్థి గీతార్థ్

చల్లపల్లి : వక్కలగడ్డ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి మద్దుల గీతార్థ్ 2025-26 విద్యాసంవత్సరానికి జవహర్ నవోదయ రెసిడెన్షియల్ పాఠశాలకు ఆరవ తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యాడు. నవోదయకు ఎంపికైన విద్యార్థిని, కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయుడు బొందలపాటి నాగమల్లేశ్వరరావును ఎంఈవోలు జిఎస్‌బి.గోపాల్, పి.వెంకటేశ్వరరావు అభినందించారు.



కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

మచిలీపట్నం టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాల్లో ఎంతో ఆనందం ఉంటుందని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ అన్నారు. రామకృష్ణతో పాటు జిల్లా వాకర్స్ గవర్నర్ అన్నం సాయిసునీత వేముల శిరీష కార్యాలయం వద్ద క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కొడాలి యోగేంద్రకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ. 17 వేలు అందజేశారు. వాకర్స్ ప్రతినిధులు యెండూరి సురేష్, శ్రీకాకుళపు రేణుకారాణి, వేముల శిరీష, అన్నం అశోక్, జల్లూరి దివ్యశ్రీ, రంగనాయకులు, అనూరాధ, ఉదయగిరి సతీష్, బలభద్రప్రసాద్, వేముల కృష్ణ, పద్మనాభుని శేఖర్, ఎస్.ఎన్. గుప్తా, కొత్త రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



వాసవీ పాలిటెక్నిక్ విద్యార్థులు 21 మంది ఉద్యోగాలకు ఎంపిక

పెడన రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : నందమూరు వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా 21 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్ బాబు తెలిపారు. డిప్లమో తృతీయ సంవత్సరం చదువుతున్న ఈసీ విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఫాక్స్‌కాన్ ఇంటర్ కనెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంటర్వ్యూలు నిర్వహించిన ఐదుగురిని 2.40 లక్షల వార్షిక వేతనంతో, అవిష్కార్ 16 మందిని రూ.2.16 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేశాయన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరెక్టర్స్ దోసపాటి బాబా, తమ్మన సాయి, ప్రిన్సిపల్ ఎన్‌వికె ప్రసాద్ అభినందించారు.

గీత కార్మికుడి మద్యం షాపులో చోరీ

పెడన, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : తోటమూల సెంటర్‌లోని ఒక వైన్‌షాపులో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. గీత కార్మికుల కోటాలో బందరు మండలం చిట్టిపాలెం గ్రామానికి చెందిన కొండేటి పేరయ్యకు వైన్‌షాపు కేటాయించారు. పేరయ తోటమూల సెంటర్‌లో పీఆర్ వైన్స్ పేరిట నిర్వహిస్తున్నాడు. గుడివాడ డిపో నుంచి సోమవారం సా యంత్రం వచ్చిన 49 మంది మద్యం కేసులను పేరయ్య తన వైన్‌షాపులో భద్రపరిచాడు. సోమవారం రాత్రి దొంగలు వైన్‌షాపు వెనుక తలుపులు లేని ఐరన్ కిటికీ ఊచలను వంచి షాపులో గల ఐదు కేసుల క్వార్టర్ మద్యం సీసాలను అపహరించుకుపోయారు. పేరయ్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అపహరించుకుపోయిన ఐదు కేసుల క్వార్టర్ మద్యం సీసాల విలువ సుమారు రూ. 30 వేలు ఉంటుందని పేరయ్య పేర్కొన్నాడు. ఏఎస్సై లక్ష్మణరావు తోటమూల వెళ్లి వైన్‌షాపును, చోరీ తీరును పరిశీలించారు. ఎస్సై జి.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

సూర్యఘర్ పథకంతో విద్యుత్ బిల్లు మినహాయింపు

అవనిగడ్డ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకం ఉపయోగించుకుని విద్యుత్ బిల్లు నుంచి మినహాయింపు పొందవచ్చునని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కృష్ణనాయక్ తెలిపారు. ఓల్డ్ ఎల్ఐసీ బజార్‌లో మూడు కిలోవాట్ల సోలార్ ప్లాంట్ అమర్చుకున్న ఆళ్ల రామకృష్ణ ఇంటిని సందర్శించి వారి వద్ద నుంచి సోలార్ ప్లాంట్ సత్ఫలితాలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లును ఇచ్చిన 15 రోజుల్లోనే చెల్లించి సర్‌చార్జీల నుంచి మినహాయింపు పొందాలని కోరారు.

ఇ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు

నాగాయలంక, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : 18 సంవత్సరాలు నుంచి 59 సంవత్సరాల లోపు ఉండి నెలకు రూ.15 వేలు ఆదాయం పొందే అసంఘటిత రంగంలో పని చేస్తున్న స్త్రీ, పురుషులకు బీమా కల్పించేందుకు ఈ-శ్రమ పోర్టల్ మంగళవారం ఆర్యవైశ్య సంఘంలో పేర్లు నమోదు చేశారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.విజయసారథి, సిబ్బంది పాల్గొని నాగాయలంకలో పలు దుకాణాలలో పని చేస్తున్న కార్మికులకు బీమా సౌకర్యానికి పేర్లను నమోదు చేశారు. టీడీపీ నేత చిట్టా వీర అన్నపూర్ణయ్య, చిట్టా శేఖర్, శివ నాగేశ్వర రావు, సాంబశివరావు పర్యవేక్షించారు.